RNI Regd. APTEL No. 2009/29147 Postal Regd. No. J/NLR/078/20-22

# ఆంధ్రలక్ష్మి

జాతీయ తెలుగు వార పత్రిక



సంపుటి : 15 సంచిక : 33 ఎడిటర్ : ఎస్.కె. గౌస్‌బాషా తేది : 26-04-2024 పేజీలు : 8 వెల : 6/-

# న్యాయానికి పెరుగుతున్న ఖరీదు..!

ఈ మధ్య కాలంలో తెలంగాణలోని మీడియా, సోషల్ మీడియాను కుదిపేసి హాట్ టాపిక్‌గా వైరల్ అయిన, అదే విధంగా పత్రికల్లో పతాక శీర్షికల్లో నిలిచిన లిక్కర్ స్కాం, డ్రగ్స్ కేసు, ఫోన్ ట్యాపింగ్ వంటి కేసుల్లో నిందితులందరు ఉన్నత స్థాయికి చెందిన రాజకీయ నాయకులు, సినీ ఇండస్ట్రీలోని ప్రముఖులు, పోలీసు అధికారులు ఉన్నారు. అయితే ఇందులో మనం క్షుణ్ణంగా గమనించాల్సింది, వీరిని అరెస్ట్ చేస్తున్నప్పుడు పిడికిలి బిగించి అభివాదం చేస్తున్న సంకేతాలు, విక్టరీ సింబల్స్ చూపిస్తూ నవ్వుతూ ఎటువంటి బెరుకు లేకుండా సదరు దర్యాప్తు సంస్థ అధికారులు సైతం గౌరవంగా తీసుకెళ్లే వీడియోలు, ఫోటోలు సామాన్యులను విస్తుగొలిపించాయి. అదే సామాన్యులనైతే ఇలా గౌరవంగా తీసుకెళ్లగలరా? సామాన్యులు తప్పు చేస్తే.. రోడ్ల మీద కొట్టుకుంటూ, ఈడ్చుకెళ్లిన సందర్భాలు కోకొల్లలు. ఇలాంటి ఘటనల మీద కనీసం కంప్లైంట్ కాదు కదా మాట్లాడే ధైర్యం చెయ్యలేని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఒకవైపైతే, సుమోటోగా తీసుకోని విచారించే బాధ్యత కలిగిన కోర్టులు సైతం తమకేమీ పట్టనట్టు ఉన్నా,




ఒకవేళ ఏవైనా ఒకటో, అరో సుమోటోగా తీసుకున్నా ఆ ఒక్క రోజు హడావిడే తప్ప సదరు అధికారుల మీద చర్యలు ఏం తీసుకున్నారో సాధారణ జనాలకు తెలిసే అవకాశమే లేదు. అలాగే మానవ హక్కుల కమిషన్ దృష్టికి వెళ్లినవి కొద్దో గొప్పో ఉండడం గమనార్హం. స్వతంత్ర పోరాటంలోనో లేదంటే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనో ఇలాంటివి ప్రజలకు ఉద్యమ స్ఫూర్తి నింపు తాయి కానీ వారి వ్యక్తిగత కేసులు ముఖ్యంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఇలా చేయడం బహుశా చట్టాలను, న్యాయస్థానాలను పరిహాసం చేయడమే కాబోలు.! ఇది ఇలా ఉంటే సమాజంలో సామాన్యులకు చిన్న చిన్న విషయాలకు ఏదైనా తగాదాలకు సంబంధించి పోలీస్ స్టేషన్ నుండి ఓ చిన్న ఫోన్ కాల్ వస్తేనో, లేదంటే ఖాకీ డ్రెస్సులో ఇంటి ముందుకు పోలీసు వస్తేనో అవమాన భారంతో కుమిలి పోతున్న జనం పరిస్థితి దయనీయం.! అయితే ముఖ్యంగా పేద మధ్యతరగతి వారికే మాత్రమే ఈ అవమానం అనే ఆభరణం ఉంటుందా లేక రాజ్య వ్యవస్థ ఈ జనాలను భయభ్రాంతులకు గురిచేసి చెప్పుచేతుల్లో పెట్టుకోవడానికి పోలీసు, న్యాయ వ్యవస్థలను పుట్టించాయేమో అనే అనుమానం రాక మానదు.! దీనికి ముఖ్య కారణం బహుశా అనేక సర్వేలు నివేదికలు ఇచ్చినట్టుగా దాదాపు ఎనభై శాతం పైచిలుకు భారతీయులకు 'లీగల్ లిటరసీ' లేనందుకేనేమో.! లెఫ్టిస్టులు విమర్శిస్తున్నట్టు పోలీసు, న్యాయ వ్యవస్థ లు, చట్టాలు చేసుకున్నది కేవలం పాలక వర్గాల ప్రయోజనాలకోసమేనేమో.. ఇక్కడ విస్తుగొలిపించే ఇంకో అంశం ఏమిటంటే, అధికారం ఉన్నన్ని రోజులు ఏ పోలీసూ కనీసం కంప్లైంట్ తీసుకోవడానికి కూడా ధైర్యం చెయ్యరు కానీ ఒక్కసారిగా అధికారం కోల్పోగానే పదవిలో ఉన్నన్ని రోజులు చేసిన ఒక్కో తప్పులను భూతద్దం పెట్టి వెతుకుతూ అంటే పాత కేసులను తోడే పనిలో పోలీసులు నిమగ్నమై ప్రభుభక్తిని పొందే పనిలో ఉండడం, వీరి ట్రాన్స్ఫర్‌లు పూర్తిగా స్థానిక ఎమ్మెల్యే, మంత్రుల ఆధీనంలో

(తరువాయి 2వ పేజీలో)

# ఎన్నికల ప్రాంగణంలో తెలుగు రాష్ట్రాల తీరు..!

భారత రాజకీయాల్లో అతి కీలకమైన ఎన్నికల పోరాటం ప్రారంభమైంది. 102 నియోజకవర్గాల్లో ఓటర్లు తీర్పునిచ్చేశారు కూడా. అతి చిన్నదైన లక్షద్వీప్‌లో 82 శాతం అత్యధిక ఓటింగు నమోదైంది. ఇండియా, ఎన్‌డిఎల మధ్య హోరాహోరీ పోరాటం జరిగే బీహార్‌లో బాగా తక్కువగా 48.8 శాతం, తమిళనాడులో 69.4 శాతం పోలింగు జరిగింది. తీవ్రమైన ఎండల మధ్య కూడా ఓటర్లు ఎంతో ఆసక్తి చూపించారని ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెల్పింది. మొత్తం పది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలింగ్ ఘట్టం ముగిసింది. తెలుగు రాష్ట్రాలతో సహా ఇంకా పోలింగ్ జరగాల్సి వుండగా నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. వైసిపి, ఎన్‌డిఎ, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ తదితర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు కూడా. ఎ.పి ముఖ్యమంత్రి జగన్‌పై రాయి దాడి ఘటనతో రెండు ప్రధాన పార్టీల వేడెక్కిన వాగ్వాదాలు, వివేకానందరెడ్డి హత్య ఆరోపణల చర్చపై కడప కోర్టు ఆంక్షలు, సి.ఎం రేవంత్, కెసిఆర్ ఆరోపణలు వీటి మధ్యనే ప్రజలు తీర్పునకు సిద్ధమవుతున్నారు. నామినేషన్ల తర్వాత ఎన్‌డిఎ కూటమిలో అభ్యర్థుల మార్పు



లు, చేర్పులు సాగుతున్నాయి. వైసిపి విషయంలో బయటికి పైకి పెద్దగా కనిపించకపోయినా అసంతృప్త నేతలు అటూ ఇటూ మారడం నిరంతర ప్రక్రియగా తయారైంది. మౌలిక విధానాలు సమస్యల విషయంలో నిబద్ధత కంటే తమ అవకాశాలు, టికెట్లను బట్టి ఆయా నేతలు మారుతున్నారు గనక నామినేషన్ల ఉపసంహరణ దాకా ఈ ప్రహసనం సాగుతూనే వుంటుంది. ఎ.పి లో టిడిపి, జనసేన, వైసిపి మూడూ బిజెపికి ప్రధాని మోడీకి లోబడిపోయిన పార్టీలే కాగా తెలంగాణలో కాంగ్రెస్, బిజెపి మధ్య పోటీ జరుగుతోంది. బిఆర్‌ఎస్ నాయకులు చాలామంది కాంగ్రెస్‌లో చేరి అభ్యర్థులుగా వుండగా బిజెపి లోనూ కొందరు చేరారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది మేమేనని రెండేళ్ల కిందటే హడావుడి చేసి సీట్లు మాత్రం పెంచుకున్న బిజెపి ఇప్పుడు కూడా తమకు అత్యధిక స్థానాలు వస్తాయని చెప్పుకుంటున్నది. సి.ఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ స్టార్ క్యాంపైనర్ హోదాలో పర్యటిస్తూ ప్రధానంగా బిఆర్‌ఎస్‌కి సవాళ్లు విసురుతూ బిజెపిని కూడా విమర్శిస్తున్నారు. విచిత్రంగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎన్నికల తర్వాత రేవంత్‌రెడ్డి బిజెపిలో చేరతారని విద్వేషపు ఆరోపణ వినిపిస్తున్నారు. ఈ ప్రభుత్వం వుండబోదని జోస్యం చెప్పడంలో మాత్రం బిజెపి, బిఆర్‌ఎస్ ఒకటిగానే వ్యవహరిస్తున్నాయి. తాను తలుపులు తీస్తే బిఆర్‌ఎస్ ఖాళీ అవుతుందని రేవంత్‌రెడ్డి హెచ్చరిస్తున్నారు. ఎ.పి లో కాంగ్రెస్ సిపిఎం, సిపిఐ ఒక అవగాహనకు వచ్చి అభ్యర్థులను నిలబెట్టాయి. కాని తెలంగాణలో అటువంటి స్థితి ఏర్పడలేదు. స్థానికంగా మాత్రం కొన్ని చోట్ల వారి ఆహ్వానంపై కమ్యూనిస్టులు కూడా ఎన్నికల సభల్లో పాల్గొంటున్నారు. రెండు చోట్లా ఒకేరోజు పోలింగ్ గనక సమన్వయం కోసం అధికారులు కొన్ని ఏర్పాట్లు చేసినట్లు కనిపిస్తుంది. ఎందుకంటే తెలంగాణలో మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో వున్న ఎ.పి ఓటర్లనూ తెలుగు ఓటర్లనూ కూడా ఈ ఎన్నికల్లో ఉపయో

(తరువాయి 3వ పేజీలో)

www.andhralaxmitelugu.in వెబ్‌సైట్‌లో వార్తలు చూడండి!

# 'ఈ' కార్మికుల అమానవీయ పరిస్థితులు..!

భారతదేశంలోని వేలాది మంది ఈ కామర్స్ వేర్‌హౌస్ కార్మికులు నెలకు రూ. 10,000 – 15,000 కంటే తక్కువ వేతనం పొందుతున్నారు. మెటీరియల్‌లను ఎంచుకొని, ప్యాకేజీ చేసేవారు, లోడ్ చేసేవారు రవాణా చేసేవారు ఇలా వారు రోజుకు 10 గంటల పాటు నిలబడి పని చేయాల్సి ఉంటుంది, గంటకు 240 వస్తువులను ప్రాసెస్ చేస్తూ ఉండాలని, కేవలం రెండు సార్లు 10 నిమిషాల విరామం మాత్రమే ఉంటుంది. ఈ గిడ్డంగులలో పని పరిస్థితులు కార్మికుల ఆరోగ్యం పై శారీరకంగా ప్రభావితమే కాకుండా వారి గౌరవానికి భంగం కలిగిస్తున్నాయి. ఈ కార్మికులకు రోజువారీ లక్ష్యాలు ఇస్తూ వాటిని చేరుకోవడంలో వైఫల్యం చెందితే కాంట్రాక్టు రద్దు చేయవచ్చు. ప్రత్యేకంగా మహిళా కార్మికులు వారి బహిష్టు సమయాల్లో భయంకరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎందుకంటే వారు ఎక్కువ గంటలు, విరామం లేకుండా విపరీతమైన నొప్పితో పాటు అసౌకర్యాన్ని భరిస్తూ పని చేయవలసి వస్తుంది. పైగా కార్మికులు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సైతం అనుమతి లేదు. ఈ కార్మికులకు రోజువారీ లక్ష్యాలు ఇస్తుం టారు. వాటిని వారు చేరుకోవడంలో వైఫల్యం చెందితే కాంట్రాక్టు రద్దు చేయవచ్చు. మహిళా కార్మికులు వారి బహిష్టు సమయాల్లో భయంకరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎందుకంటే వారు ఎక్కువ గంటలు, విరామం లేకుండా



విపరీతమైన నొప్పితో పాటు అసౌకర్యాన్ని భరిస్తూ పని చేయవలసి వస్తుంది. కార్మికులు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి కూడా అనుమతి లేదు. వారు "దాదాపు రోబోట్" లాగా పని చేయవలసి వస్తుంది. ఉదాహరణకు, ఈ కంపెనీల అవుట్‌బౌండ్ డిపార్ట్‌మెంట్‌లోని ఒక కార్మికుడు ఒక గంటలో 600 ప్యాకేజీలపై లేబుల్‌లను ఉంచాలని ఆదేశం ఉంటుంది. ఆ లక్ష్యాన్ని కార్మికుడు చేరుకోకపోతే కార్మికుడిని మందలించడం, కొన్నిసార్లు బహిరంగంగా అవమానించడం లేదా కార్మికుడిని ఉద్యోగం నుండి తొలగించే పరిస్థితులు ఉన్నాయి. ఈ గిడ్డంగులలో పని పరిస్థితులు కార్మికుల ఆరోగ్యంపై శారీరకంగా ప్రభావితమే కాకుండా వారి గౌరవానికి భంగం కలిగిస్తున్నాయి. కార్మికులు గాయపడినప్పుడు కూడా, వారికి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసేంత వరకు పనిని కొనసాగించవలసి వస్తుంది. వారు అలా చేయడంలో విఫలమైతే, లేదా వైద్య సహాయం కోసం అనుమతి కోరితే, వెంటనే రద్దు చేస్తామని బెదిరిస్తారు. ముప్పై నిమిషాల ఆహార విరామంలో, గేట్ వద్ద భద్రతా తనిఖీ కోసమే పదిహేను నిమిషాలు వెచ్చించే పరిస్థితి. ఈ కంపెనీల వేర్‌హౌస్ కార్మికులందరూ కాంట్రాక్ట్‌పై నియమించబడతారు. ఒక కార్మికుడు ఈ వేర్‌హౌస్‌లో ఎనిమిదినెలలకు పైగా పని చేస్తున్నప్పటికీ, వారి ఒప్పందాలు అకస్మాత్తుగా రద్దు చేయబడతాయి. ఈ కార్మికులకు స్థిరమైన వేతనాలు లేదా ఏ విధమైన సామాజిక భద్రత లేదు. వారికి వేతనంతో కూడిన సెలవులు, ప్రసూతి సెలవులు లేదా మరే ఇతర ఉద్యోగ ప్రయోజనాలు లేవు. ఈ కనికరంలేని దోపిడీని అమెజాన్ కార్మికులు ప్రతిఘటిస్తున్నారు.

భారతదేశంలోని ఈ-కామర్స్ గుత్తాధిపత్య సంస్థ అమెజాన్ కార్మికులు వారి కఠినమైన పని పరిస్థితులకు వ్యతిరేకంగా ప్రచారాన్ని ప్రారంభించారు. వారు అమెజాన్ ఇండియా గ్లోబల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కంట్రీ హెడ్, అమెజాన్ ఇండియా ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్, భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రి భూపేందర్ యాదవ్‌కు లేఖ రాశారు. తమ లేఖలో వారు పని చేయాల్సిన అమానవీయ పరిస్థితులను ఎత్తిచూపి డిమాండ్లను హైలైట్ చేశారు. అన్ని అమెజాన్ గిడ్డంగుల్లోని కార్మికులందరికీ సమాన వేతనాన్ని అందించాలని, అలాగే కనీస వేతనం రూ.25,000, దీపావళి బోనస్ రూ.20,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని, 200 రోజులు పనిచేసిన కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని, 240 రోజులు పనిచేసిన కార్మికులందరికీ పర్మినెంట్ హోదా కల్పించాలని, విధి నిర్వహణలో ప్రమాదాల బారిన పడిన కార్మికులందరికీ తగిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళా కార్మికులపై వేధింపులు జరగకుండా నిబంధనలు అమలు చేయాలని, ముఖ్యంగా మహిళా కార్మికులకు విశ్రాంతి, పరిశుభ్రమైన టాయిలెట్, విశ్రాంతి గది సౌకర్యాలు కల్పించాలని, కార్మికుల శారీరక మానసిక సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని మానవీయ కోణంలో ఆలోచించాలని అమెజాన్ కార్మికులు కంపెనీ యాజమాన్యాన్ని కోరారు. నోటీసు లేకుండా తమ జాబ్‌కార్డులను కంపెనీ ఏకపక్షంగా బ్లాక్ చేయడాన్ని అరికట్టాలని, తమ కుటుంబాలపై వేధింపులను ఆపాలని కోరారు. అమెజాన్ కార్మికుల డిమాండ్ పూర్తిగా న్యాయమైనది.

## న్యాయానికి పెరుగుతున్న ఖరీదు..!

(1వ పేజీ తరువాయి)

ఉండడం చూస్తున్న ప్రజలకు అధికార పార్టీకి పోలీసులు గులాములనే విషయం క్షుణ్ణంగా అర్థమైపోతుంది. కేవలం చట్టాన్ని అమలు చేయడానికే పోలీసు వ్యవస్థ ఉందని, శిక్ష విధించే అధికారం కేవలం ఒక్క కోర్టుకు మాత్రమే ఉందన్న విషయం బహుశా పోలీసులు కూడా రాజకీయ ఒత్తిళ్లలో పడి మరిచిపోతుంటారేమో.. గద్దర్ ఒక పాటలో 'ఏ చట్టం మీకిచ్చిన హక్కులివి చెప్పారాద' అంటూ సూటిగా ప్రశ్నించిన సందర్భాలు లేకపోలేదు. పోలీస్ కంప్లైంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని, అందులో జిల్లా స్థాయి అథారిటీ కానిస్టేబుల్ నుండి డీఎస్పీ వరకు, రాష్ట్ర స్థాయి అథారిటీ ఎస్పీ నుండి పై స్థాయి అధికారులపై వచ్చే ఫిర్యాదులను విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్ర ప్రభుత్వం బేఖాతరు చేసింది. అలాగే పోలీసు భద్రతా కమిషన్ కూడా వెయ్యాలని ఆదేశించింది. ఇదే విషయమై ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రెసిడెంట్ పద్మనాభ రెడ్డి గారు ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఇకపోతే న్యాయస్థానాల్లో సంపన్నులు బెయిల్ కోసం అడిగే సాకులు చూస్తుంటే చట్టాల్లో ఉన్న వెసులుబాటులను ఎలా దుర్వినియోగం చెయ్యాలో వీరికి బాగా తెలుస్తోంది అనడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఎనభై శాతం పైచిలుకు అంగవైకల్యం ఉన్న ప్రొఫెసర్ సాయిబాబా లాంటి బుద్ధిజీవుడు నీళ్ల తాగడానికి స్ట్రా కోసం పర్మిషన్ ఇవ్వకపోగా, విచారణ పేరుమీద ఎంతో మంది బుద్ధిజీవులు, ఆదివాసుల విలువైన జీవితాలను కారాగారాల్లోనే ఖర్చు చేయిస్తున్నారు. కానీ అదే న్యాయస్థానాలు ఒకవైపు, బంగారు ఆభరణాలు ధరించే వెసులుబాటులు, పడుకోవడానికి విలాసవంతమైన పరుపు, ఇంటి భోజనాలను తెప్పించుకునే అర్హత కేవలం డబ్బున్న లాయర్లను పెట్టుకుంటే వస్తుందేమో.! లేదంటే రాజకీయ పలుకుబడి ఉన్నోళ్లకు, ఆర్థిక నేరగాళ్లకు మాత్రమే న్యాయస్థానాలు కల్పిస్తాయేమో.!! ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌ను ఉద్దేశించి 'సామాన్యులకైనా సీఎం కైనా న్యాయం ఒకటే' అన్నట్లు వ్యాఖ్యానించిది కానీ, వీఐపీల పేరు మీద వీళ్లకు ఉన్న వసతుల్లో కనీసం ఒకటో వంతైనా సామాన్యులకు ఉన్నాయా అనేది ప్రశ్నార్థకమే.. న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా 5 కోట్ల పైచిలుకు సివిల్, క్రిమినల్ కేసులు పేరుకుపోతుండగా, అందులో కేవలం సివిల్ కేసులే 1.1 కోట్లకు పైగా పెండింగ్ లో ఉండడం చూస్తుంటే న్యాయస్థానాల పనితీరు ప్రశ్నార్థకంగా అనిపించక మానదు. ఈ మధ్య కాలంలో ఒకేసారి 600 మంది న్యాయవాదులు కలిసి సిజెఐకి లేఖ రాస్తూ న్యాయవ్యవస్థను తప్పు పట్టేందుకు మీడియా అనేక కథనాలు రాస్తోంది, వీటివల్ల న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందని, కోర్టులే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలుగా ఉండేలా చూసి, రాజకీయ ఒత్తిళ్ల నుంచి న్యాయవ్యవస్థను కాపాడుకునే అవసరం ఉందని వాపోయారు. న్యాయం కూడా కాలంతో పాటు ఖరీదు అవ్వడం కాకతాళీయమే అయినప్పటికీ, కోర్టుల్లో సరైన వసతులు కల్పించి, పెద్దమొత్తంలో నియామకాలు చేపట్టి, న్యాయవాదుల్లో కొత్త తరానికి చేయూతనిస్తూ, మనలాంటి ప్రజాస్వామిక దేశంలో పేద ప్రజలకు న్యాయాన్ని తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండేలా చూడడం ప్రభుత్వ బాధ్యత.


## స్వార్థానికే.. ప్రస్తుత రాజకీయాలు..!



ఏ పార్టీ అయినా సరే, పార్టీకి కార్యకర్తలే కీలకం. ప్రస్తుత పరిస్థితులలో కార్యకర్తల పరిస్థితి చాలా అధ్వానంగా తయారైంది. పార్టీ ప్రోగ్రాంలో బ్యానర్లు కట్టే మొదలు నుంచి నాయకుడు గెలుపోటములు నిర్ధారించే వరకు ప్రతి ప్రోగ్రాం విజయవంతం చేయడంలో కార్యకర్తల ముఖ్య భూమిక పోషిస్తారు. అలాంటి కార్యకర్తల నమ్మకాన్ని వమ్ము చేసి నాయకులు గెలిచాక, నువ్వు ఎవరు నీ పేరేంటి అనే పరిస్థితులు కూడా కొందరు నాయకుల దగ్గర ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాలను తమ స్వార్థానికి నాయకులు వాడుకుంటున్నారు. ఎమ్మెల్యేలు ఎంపీలుగా గెలిచాక ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉందో ఆ పార్టీలకు తమ ఆస్తులు కాపాడుకోవడానికే వాళ్ళు చేసిన అక్రమాలు బయట పడకుండా ఉండడానికి పార్టీలు మారుతున్నారు. అధికారంలో ఉన్న పార్టీలు సైతం తమ పార్టీలో సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ ఎమ్మెల్యేలుగా గెలిచిన కొత్త నాయకులకు పార్టీలోకి ఆహ్వానం పంపిస్తూ వారికే ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తున్నారు. కొందరు నాయకులు అయితే ఎన్నికల్లో పోటీకి ముందు వారు నమ్ముకున్న పార్టీ టికెట్ ఇవ్వకపోతే తమ స్వార్థం కోసం, టికెట్ కోసం పార్టీ మారుతూ మా నియోజకవర్గ ప్రజల కోసమే పార్టీ మారుతున్నానని గప్పాలు కొట్టడం విడ్డూరం కలిగిస్తోంది. కింది స్థాయి కేడర్‌ని, కార్యకర్తలను పూర్తిగా తమ స్వలాభం కోసమే వాడుకుంటున్న కొందరు నాయకుల తీరు విచిత్రంగా ఉంది. లీడర్ కోసం కొన్ని సందర్భాల్లో తమ నాయకుడు గెలుపు కోసం కేసులు సైతం లెక్కచేయకుండా ఎన్నికల్లో పని చేస్తున్నారు. కానీ తీరా గెలిచాక ముఖం చాటేస్తూ అధికారంలో ఉన్న పార్టీలకు కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎంపీలు జంప్ అవుతున్నారు. నమ్ముకున్న వ్యక్తి ఎమ్మెల్యే అయితే తమకి సర్పంచులుగా ఎంపీటీసీలుగా పోటీ చేసి గెలిచే అవకాశం ఉంటుందని తమ నాయకుడు గెలుపు కోసం డబ్బులు కూడా ఖర్చు చేస్తున్నారు. తీరా గెలిచాక దీనికి మోహం చాటేస్తున్నారు. ఏదైనా ఒక పార్టీ గుర్తుతో గెలిచి వేరే పార్టీలోకి మారితే ఆ నాయకుడి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోర్టులో కేసు వేయవచ్చు. పార్టీ ఉల్లంఘన క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీ కూడా అలాంటి పనులు చేయకుండా వెళ్లే వాళ్ళు వెళ్ళనీ అని చేతులు దులుపుకుంటున్నారు.ఇలాంటి నాయకులకు జెండా పట్టేవాడి విలువ తెలియజేయాలన్నదే నా ఆశ.

# నగర వీధుల్లోనే శిథిలమౌతున్న బాల్యం..!

వీధి బాలలు దైన్యంగా కనబడకూడదు. ఫుట్‌పాత్‌లపైన, చిరిగిన బట్టలతో, ఎండిన డొక్కలతో, దుమ్ము ధూళితో, మురికి పట్టి మన కంటపడకూడదు. లేకుంటే ప్రపంచం ముందు మన పరువేం కావాలి. ఇప్పుడిదీ మన ఏలికల ఆలోచన! ఈఏడాది అంతర్జాతీయ బాలల హక్కుల కన్వెన్షన్ (జీ20 శిఖరాగ్ర సమావేశాలు) మన దేశంలో జరగబోతుంది. వెంటనే రోడ్లపై కనిపించే బాలలందరినీ తరలించమని ఆదేశాలు జారీ చేశారు. దానికోసం రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. మే 1 నుండి 31 వరకు దేశవ్యాప్తంగా జిల్లాల్లో ఈ ఆపరేషన్ కొనసాగింపులో భాగంగా చర్యలు చేపడుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) ఈ నిర్ణయం తీసుకుంది. అందుకే 'కేవలం దేశాన్ని సందర్శించనున్న జీ20 ప్రతినిధులకు మన దేశ బాలల వాస్తవ పరిస్థితి కంట పడకుండా దాచడానికి చేస్తున్న ప్రయత్నమే ఇది. వీధి బాలల అభివృద్ధి విషయంలో మన ప్రభుత్వం ఇప్పటి వరకు సరైన చర్యలు చేపట్టలేదు. వారికి పునరావాసం కల్పించేందుకు అవసరమైన సౌకర్యాలు ఎక్కడా లేవు' అంటున్నారు ప్రముఖ సామాజిక కార్యకర్త నిర్మల్ గోరానా. నిజమే కదా! వచ్చే ప్రతినిధులకు మసిబారిన మన బాల్యం కనిపించకూడదనేగా మన వాళ్ళ హడావుడి. వీధి బాలలను పరిరక్షణా కేంద్రాలకు తరలిస్తున్నామనే పేరుతో ఏ చీకటి గుహల్లోకో నెట్టేసేందుకు ప్రణాళిక రూపొందించారు. పైగా కనిపించే వాస్తవాన్ని కనుమరుగు చేసేందుకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. మా దేశం వెలిగిపోతోందని ప్రపంచ దేశాల ముందు గొప్పలు



పోయేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా సమస్యలను దాచేయడం మన పాలకులకు కొత్తేమీ కాదు. గతంలో ట్రంప్ వస్తున్నాడని ఇలాగే హంగామా చేశారు మన ప్రధాని. ఆయన పర్యటించే ప్రాంతాల్లో యాచకులు కనబడకుండా వాళ్ళను ఎక్కడో దూరంగా పడేసి వచ్చారు. మనది సంపన్న దేశంగా చూపించేందుకు నానా తంటాలు పడ్డారు. ఇప్పుడు వీధి బాలల వంతు. ప్రజల బాధలే తన బాధలని చెప్పుకునే ప్రధాని పరివారం చెయ్యాల్సిన పనులేనా ఇవి? తనేదో గొప్ప పనులు చేస్తుంటే ప్రతిపక్షాలు తిడుతున్నారని కన్నీరు కారుస్తున్నారు. వీధి బాలల కన్నీళ్ళు మాత్రం ఆయనకు కనబడవా? నిజానికి వీధి బాలలకు సురక్షితమైన ప్రదేశం ఏదైనా ఉందీ అంటే అది కేవలం ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు మాత్రమే. నిర్మల్ గోరానా అన్నట్టు ప్రభుత్వ విద్యాసంస్థలను మన పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పేదలకు విద్యను అందని ద్రాక్షగా చేస్తున్న వీళ్ళు వీధి బాలల జీవితాలను ఎలా మారుస్తారో చెప్పాలి? ఈ ఆపరేషన్‌కి అంతర్జాతీయ స్థాయిలో బాలల కోసం పని చేస్తున్న యునెసెఫ్‌ను దూరం పెట్టమన్నారు. అంటే వీరి చేతల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో దీనివల్ల అర్థమవుతుంది. జీ20 దేశాల ప్రతినిధులు మన దేశంలోని బాలల దుస్థితిని చూసి ఎక్కడ ఛీ కొడతారో అని వారి భయం. అయితే ఇక్కడ జీర్ణించుకోలేని వాస్తవం ఏమిటంటే దేశంలో వీధి బాలల సంఖ్యపై ప్రభుత్వం వద్ద సరైన డేటా లేకపోవడం. ఒక్కో స్వచ్ఛంధ సంస్థ అంచనాలు ఒక్కో రకంగా ఉంటున్నాయి. రెయిన్‌బో హౌమ్స్ అనే ఎన్‌జీఓ ప్రకారం గత 20ఏండ్లుగా భారతదేశంలోని 10నగరాలైన ఢిల్లీ, ఆగ్రా, అలహాబాద్, కాన్పూర్, లక్నో, మొఘల్ సరారు, ముంబై, నాసిక్, పూణే, కోల్‌కతాల్లో కోటి ఎనభై లక్షల మంది వీధి బాలలున్నారు. ఈ నగరాల్లో నిర్వహించిన సెన్సస్ సర్వే 2,02,765 మంది పిల్లలను గుర్తించింది. ఇందులో ఢిల్లీ 81,235, మహారాష్ట్ర 52,535, ఉత్తరప్రదేశ్ 30,407, కోల్‌కతా 20,068గా సంఖ్యలు ఉన్నాయి. మరో సర్వే ప్రకారం ఒక్క మన హైదరాబాద్‌లోనే 50 నుండి 75 వేల మంది వీధి బాలలు ఉన్నట్టు తేలింది. 3-5 ఏండ్ల మధ్య వయసు వారిలో 58.1శాతం మందికి ప్రభుత్వ విద్య లేదు. 11-14 ఏండ్ల మధ్య పిల్లల్లో కేవలం 33శాతం మంది మాత్రమే ప్రాథమిక విద్య పొందుతున్నారు. మిగిలిన వారంతా కన్న వాళ్ళకు దూరంగా, దురలవాట్లకు అత్యంత దగ్గరగా మసులుతున్నారు. నేర ప్రపంచంలో పావులవుతున్నారు. లైంగిక వేధింపులకు గురవుతూ అసహాయంగా బతుకుతున్నారు. ముఖ్యంగా ఆడపిల్లల పరిస్థితి మరింత దారుణం. ఇటువంటి దుస్థితిలో ఉన్న వీధి బాలల జీవితాలను బాగు చేయాల్సిన బాధ్యత ఎవరిది? ప్రభుత్వానిది కాదా? స్వచ్ఛంధ సంస్థలు చేస్తున్న పనిని మన దేశ పాలకులు ఎందుకు చేయలేకపోతున్నారో సమాధానం చెప్పాలి. సమస్యలు పరిష్కరించలేని నేతలు దానిని దాచేయడానికి తెగ ఆరాట పడుతున్నారు. కష్టాల కొలిమిలో కాలిపోతున్న భావి భారతాన్ని చీకట్లో దాచి వెలుగుల దేశంగా చూపించేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నారు. సత్యాలను, వాస్తవాలను కప్పిపుచ్చుటమే ఈనాటి పాలకుల లక్షణంగా కనబడుతున్నది. అయితే సత్యాలు బయటికి రాక మానవు. అబద్దాలు, దాచివేతలతో ఎంత కాలం కొనసాగుతారు. బాలల భవిష్యత్తు కోసం కృషి చేయాల్సిన వారు ఇలా కప్పిపుచ్చి తమ బాధ్యత నుండి తప్పుకోలేరు.

## ఎన్నికల ప్రాంగణంలో తెలుగు రాష్ట్రాల తీరు..!

(1వ పేజీ తరువాయి)

గించే వ్యూహాలపై టిడిపి, వైసిపిల మధ్య ఆరోపణల యుద్ధం జరిగిన నేపథ్యంలో, జిహెచ్‌ఎంసి ప్రాంతంలో బిఆర్‌ఎస్ అత్యధిక స్థానాలు తెచ్చుకున్న రీత్యా ఈ ఏర్పాటు ప్రాధాన్యత సంతరించుకుంటుంది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కోయంబత్తూరు వెళ్లి బిజెపి అభ్యర్థి అన్నామలై తరపున ప్రచారం చేశారు గాని తెలంగాణలో వారు ఒక వైఖరి తీసుకోలేదు. అలాగే జనసేన, బిఆర్‌ఎస్‌కూ వైసిపికి సత్సంబంధాలు వుండటంతో ముఖ్యమంత్రి జగన్... కాలుకు గాయమైన కెసిఆర్‌ను పరామర్శించి వెళ్లారు గానీ తనకు అభినందనలు తెల్పలేదని రేవంత్ రెడ్డి బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఎ.పి లో ఏం జరుగుతుందనే దానిపై తాము మాట్లాడబోమని కెటిఆర్, హరీశ్‌రావు వంటి వారు ప్రతిస్పందించారు. రెండు రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితిలో తేడాలు, పోలికల తీరిది. విభజన తర్వాత మూడోసారి ఎన్నికలు జరుగుతున్న ఎ.పి లో ఎవరు అధికారంలోకి వస్తారనే దానిపైనే ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఎన్నికల సర్వేలు రకరకాలుగా వస్తుంటే ఎవరివైపు వస్తే వారు మురిసిపోతూ మిగిలినవి పెయిడ్ సర్వేలని ఈసడిస్తున్నారు. దేశ వ్యాపితంగా బిజెపి అనుకూల సర్వేలు గుప్పిస్తున్న బడా మీడియా ఇక్కడ మాత్రం రెండు రకాలుగా వ్యవహరిస్తున్నది. తెలుగు మీడియా ఎలాగూ రెండుగా విడిపోయి చాలా కాలమైంది. అందుకే ఏ సందర్భమైనా ఏ సమస్య అయినా వారు ఒకలా వీరు ఒకలా ఇస్తారనేది ప్రజలకు అర్థమైపోయింది. వాస్తవానికి ప్రజాశక్తి, విశాలాంధ్ర వంటివి మాత్రమే తమ పరిధిలో అవకాశం మేరకు ఇరుపక్షాల సమాచారం విశ్వసనీయంగా ఇస్తున్నాయి. రెండు పాలక పార్టీల యుద్ధంలో బూతులు, రాళ్ల చుట్టూ తిరగడమే సరిపోతుందని సిపిఎం కార్యదర్శి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్య సరైందే. ఈ క్రమంలో రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలు, కేంద్రం వివక్ష, నిర్లక్ష్యం వంటి వాటి ఊసే లేకుండా పోయింది. ఇరు శిబిరాలూ మోడీకి అనుకూలమే గనక తమను తాము తిట్టుకోవడానికే పరిమితమవుతున్నారు. సిపిఎం ఇరు శిబిరాలకు అనేక ప్రశ్నలు సంధించినా ఎవరూ స్పందించిన పాపాన పోలేదు. ఇరు పక్షాలూ ఇంతవరకూ ఎన్నికల ప్రణాళికలు కూడా విడుదల చేసింది లేదు. మోడీ సమర్థవంతమైన నాయకత్వంలో ఎన్నికలకు వెళుతున్నామని చెప్పిన ఎ.పిలో ఎన్‌డిఎ ఉమ్మడి ప్రణాళిక ఇచ్చే అవకాశం వుండదేమో. ఎందుకంటే అప్పుడు ప్రత్యేక హెూదా, పోలవరం, రాజధాని, విభజన సమస్యలు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలపై హామీలివ్వాలి. పదేళ్లు పూర్తవుతున్నాయి గనక ఆ హామీలకు కాలం చెల్లిపోతుందనే భయాందోళనలూ వున్నాయి. ఇన్నేళ్లలో వాటిని ఘోరంగా ఉపేక్షించిన కేంద్ర బిజెపి ఇప్పుడు స్పందిస్తుందనే ఆశ ఏ కోశానా లేదు. ప్రజల్లో దానికి ఆదరణా లేదు. తమకు ఉమ్మడి ప్రణాళిక ఇచ్చే ఆలోచన లేదని బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరి ఇప్పటికే ప్రకటించేశారు కూడా. 'ఇద్దరం కలసి ప్రణాళిక' అన్న జనసేన, టిడిపి కూడా ఆరు గ్యారంటీలతో ఆగిపోయాయి. ఇక ముఖ్యమంత్రి రూ.270 వేల కోట్ల పథకాల నగదు బదిలీ గురించే ప్రచారం చేసుకుంటున్నారు. దీర్ఘకాల పథకాలు, అయిదేళ్లలో అమలు కాని హామీలు, ప్రాజెక్టుల వంటి వాటిపై మాట్లాడ్డం లేదు. సంక్షేమ పథకాలు మంచివైనా ఉపాధి, ఉత్పత్తి పెంపు వంటి వాటిపై స్పందనే లేదు. దీనిపై ప్రజల్లో ప్రశ్నలు రావడంతో తామే ఎక్కువ పెట్టుబడులు తెచ్చామని ఈ మధ్య ప్రచారం ఎత్తుకున్నారు. పేదలకు సంక్షేమ పథకాల గురించే చెబుతూ అదానీ వంటి వారికి అపారమైన అవకాశాలు, వనరులు కట్టబెట్టిన సంగతి కప్పిపుచ్చుతున్నారు. ముగ్గురి మధ్య పోలవరం ప్రాజెక్టును ప్రతిష్టంభనలో పడేశారు. ప్రాణప్రదమైన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ పైన కూడా గట్టి వైఖరి లేదు. ఈ సమయంలోనే దాని పీక నులిమేందుకు కుట్రలు జరుగుతుంటే మూడు పార్టీలూ పెదవి మెదపలేదు. గెలిస్తే విశాఖ పాలనా రాజధానిగా అక్కడే ప్రమాణ స్వీకారం చేస్తానంటూ అర్ధంతరంగా ఆగిపోయిన అమరావతి భవిష్యత్తు ఊసెత్తడం లేదు. రాష్ట్రం అప్పుల భారం ఆందోళన కలిగిస్తుంటే వైసిపి మాట్లాడదు. కోటిన్నర కోట్ల అప్పులు చేసిన కేంద్రం గొప్పదైనట్టు ఎన్‌డిఎ కబుర్లు చెబుతుంది. వ్యవసాయం, ఉపాధి హామీ, వృత్తిదారుల మనుగడ, పట్టణాల సదుపాయాలు వంటి అనేక సమస్యలు చర్చకు నోచుకోలేదు. ఇరువైపులా వున్న మీడియా అంతకు మించి సోషల్ మీడియా నిరర్థక వివాదాలను, పాక్షిక కోణాలను భూతద్దంలో చూపుతూ ఎజెండానే పక్కదోవ పట్టిస్తున్నది. బాధ్యత గల సీనియర్ నాయకులు, అధికార హెూదాల్లో వున్నవారు కూడా సంయమనం చూపకపోగా ఈ ధోరణులనే ఎగదోస్తూ వస్తున్నారు. ఎ.పి లో పరాకాష్టకు చేరిన ఈ తిట్ల పురాణం తెలంగాణలోనూ కొనసాగుతున్నది. విధానపరమైన విశాల జనరాశులకు సంబంధించిన విస్తృత అంశాలు తెర మరుగైపోతున్నాయి. ఇక లౌకికతత్వం, సమాఖ్యతత్వం, రాష్ట్రాల హక్కులు, సామాజిక న్యాయం వంటివి ప్రస్తావనకే రావడం లేదు. సోషల్ జస్టిస్‌కు భిన్నంగా ఒకప్పుడు బిజెపి సిద్ధాంతకర్త గోవిందాచార్య తీసుకొచ్చిన సోషల్ ఇంజనీరింగ్ ఇప్పుడు పాలక పార్టీల మంత్రజపమైంది. విచిత్రంగా మంద కృష్ణ మాదిగ వంటి వారు వర్ణ వ్యవస్థ సమర్థించే సంఘపరివార్ ప్రధాని దళితోద్ధారకుడని భజన చేస్తున్నారు. ఎ.పి రాజకీయ రంగం ఎప్పటి కంటే ఎక్కువగా కులాల కుంపట్లు చూస్తున్నది. అంతర్వేది నుంచి రామతీర్థం దాకా బిజెపి ఎ.పి లో రగిలించాలని చూసిన మత రాజకీయాలు ప్రజలు ఆదరించకపోవడం మాత్రం స్వాగతించదగింది. అదే హైదరాబాద్‌లో అసదుద్దీన్ ఒవైసీ, బిజెపి కార్పొరేట్ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత పోటీలో సంఘ పరివార్ మతతత్వ పైత్యం గుమ్మరిస్తూంటే మజ్లిస్ తన తరహా ఆరోపణలు చేస్తున్నది. నిజానికి సికింద్రాబాద్‌లోనూ కిషన్‌రెడ్డిపై అసంతృప్తి పెరిగిందనే మాట వినిపిస్తోంది. అభ్యర్థుల ఎంపిక దశలోనే వైసిపి ముందే మల్లగుల్లాలుపడి దాదాపు సగం మందిని రకరకాలుగా మార్చింది. ఇక బిజెపి వెంటబడి మరీ నేరుగా పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన సీట్ల పంచాయితీ ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదు. 'వైనాట్ 175' అని జగన్ ప్రచారం, 165 వస్తాయని చంద్రబాబు అతిశయాల మధ్య ఇరుపక్షాలు కూడా వాస్తవంలో 110-120కి అటూ ఇటుగా తెచ్చుకుంటే పదివేలని పాచికలేస్తున్నాయి. తెలంగాణలోనైతే పది స్థానాలకు పైగా తెచ్చుకుంటేనే రేవంత్ సర్కారు స్థిరపడుతుందనే భావన వుంది. 129 స్థానాలున్న దక్షిణ భారతంలో గతంలో 25 మాత్రమే తెచ్చుకున్న బిజెపి ఇప్పుడు వాటిని కూడా నిలబెట్టుకునే అవకాశం లేదనేది స్పష్టం. క్షేత్ర స్థాయిలో ప్రచారంలో పాల్గొంటున్న ప్రజలను కలుసుకుంటున్న సీనియర్ నాయకులు, పరిశీలకులకు కొన్ని అంచనాలు స్థూలంగా వున్నా వాటిని ఎన్నికల ముందు వెల్లడించడం లేదు. ఎవరి సర్వేలు ఎవరూ నమ్మే పరిస్థితి దేశంలో లేదని రాజ్‌దీప్ సర్దేశాయి సూటిగానే చెప్పేశారు. కనుక ప్రజల సమస్యలపై సమగ్రమైన వైఖరితో ప్రచారం చేయడం, ఎన్నికల పోరాటాన్ని ప్రశాంతంగా ముగిసేట్టు చూడటం ఇప్పుడు కర్తవ్యం. తుది తీర్పు ప్రజలే ఇస్తారు.

తేది : 26-04-2024 ఆంధ్రలక్ష్మి 4 సంపుటి : 15 సంచిక : 33

## 'ఉచితాలకు నేను వ్యతిరేకం'.. ఫ్రీ స్కీమ్స్‌పై వెంకయ్యనాయుడు సంచలన వ్యాఖ్యలు



ప్రభుత్వ ఉచిత పథకాలపై భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఉచితాలకు తాను వ్యతిరేకమని ప్రకటించారు. కొన్ని పార్టీలు ఇష్టారాజ్యంగా హామీలు ఇస్తున్నాయని, ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా ఇవ్వండి తప్పులేదు.. కానీ ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేసే ఉచితాలు కరెక్ట్ కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇచ్చిన ఉచిత హామీలు అమలు చేయడం కోసం మళ్లీ అప్పులు చేయడం సరికాదని హితవు పలికారు. ప్రజలకు ఏం చేస్తారో అవే ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని సూచించారు. ఉచితాలపై ప్రజలు కూడా రాజకీయ పార్టీలను ప్రశ్నించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. పార్టీ ఫిరాయింపులపై వెంకయ్యనాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరొక పార్టీలోకి వెళ్లడం ఇటీవల రాజకీయ నాయకులకు ట్రెండ్‌గా మారిందని అసహనం వ్యక్తం చేశారు. పార్టీ మారాలనుకునే నేతలు వాళ్ల పదవికి రాజీనామా చేసి ఏ పార్టీలో అయినా చేరవచ్చన్నారు. పదవికి రాజీనామాకు చేయకుండా పార్టీ ఫిరాయించి నేతలపై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత బలోపేతం చేయాలని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసభ్యంగా మాట్లాడేవారిని, అవినీతిపరులను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు.

## ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులపై ఈసీ బదిలీ వేటు





ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులపై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. ఇంటెలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులుతో పాటుగా విజయవాడ సీపీ కాంతిరాణాను బదిలీ చేస్తూ ఈసీ ఉత్తర్వులు వెలువరించింది. ఇద్దరినీ తక్షణమే విధుల నుంచి తప్పించాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేగాక, ఇద్దరిని ఎన్నికల విధులకు కూడా దూరంగా ఉంచాలని ఈసీ స్పష్టం చేసింది. ఇద్దరు అధికారులకు ఎన్నికలతో సంబంధం లేని విధులు అప్పగించాలని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. బదిలీ చేసిన ఇద్దరి స్థానంలో కొత్తవారిని నియమించాలని ఈసీ తన ఆదేశాల్లో పేర్కొంది. కాగా, డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులుపై ఈసీకి పలు మార్లు ఫిర్యాదులు అందాయి. ఏపీలో పలువురు ఐపీఎస్ అధికారుల వ్యవహారశైలిపై ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి తోపాటు కొందరు టీడీపీ నేతలు కూడా కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్న చిలకలూరిపేట సభలో భద్రతా వైఫల్యాలతోపాటు ఎక్కడికక్కడ చెక్ పోస్టులు పెట్టి కార్యకర్తలు సభా ప్రాంగణానికి చేరుకోకుండా ప్రయత్నించారు. ఎన్నికలను మేనేజ్ చేసేందుకు, తప్పుడు సర్వేలు చేయించేందుకు భారీగా నగదు తీసుకున్నారు. చాలా మంది విపక్ష నేతల అక్రమ అరెస్టులకు కూడా సీతారామాంజనేయులు బాధ్యులుగా ఉన్నారని పురంధేశ్వరి ఈసీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. అంతేగాక, మూడేళ్లుగా ఇంటెలిజెన్స్ డీజీగా కొనసాగుతున్న ఆయన అపరిమిత అధికారాలు ఉపయోగించుకుని విపక్ష నేతలను వేధిస్తున్నారని పురంధేశ్వరి తెలిపారు. మరోవైపు, విజయవాడ సీపీ కాంతిరాణా టాటా.. వైసీపీతో అంటకాగుతూ చిన్నా చితకా కారణాలకు కూడా విపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టడంలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. సీఎం పేషీ నుంచి వచ్చిన ఆదేశాలమేరకే సీపీ నడుచుకుంటున్నారని పురంధేశ్వరి ఈసీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. మరోవైపు, ఇటీవల సీఎం జగన్ పై రాయిదాడి ఘటనకు సంబంధించి కూడా కాంతిరాణాను సీపీ బాధ్యతల నుంచి తప్పించాలని విపక్ష నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈసీ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

## అధికారంలోకి రాగానే.. మేడ్ ఇన్ ఇండియా..!



మనం విదేశీ గాడ్జెట్స్ కొన్నప్పుడు వాటిపై మేడిన్ చైనా, మేడిన్ జపాన్ వంటివి చూస్తుంటాం.. అలాగే ఇండియాకి.. మేడ్ ఇన్ ఇండియా అనే ముద్ర ఉంది. కానీ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. మేక్ ఇన్ ఇండియా అనే నినాదం అందుకొని.. మేడ్ ఇన్ ఇండియాని పక్కన పెట్టింది. ఐతే.. ఇది ఇండియాలోనే తప్ప.. అంతర్జాతీయంగా గుర్తింపు పొందలేదు. తాజాగా కేంద్రం మళ్లీ మేడ్ ఇన్ ఇండియాపై ఫోకస్ పెడుతోంది. మళ్లీ అధికారంలోకి వచ్చి.. మొదటి 100 రోజుల్లోనే మేడ్ ఇన్ ఇండియా స్కీమ్ ప్రారంభించాలి అనుకుంటోంది. ఈ స్కీమ్ ద్వారా కేంద్రం ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్, ఫార్మాస్యూటికల్స్, టెలికం, నెట్‌వర్క్ ప్రొడక్టులపై మేడ్ ఇన్ ఇండియా ముద్ర వేస్తుందని తెలుస్తోంది. అలాంటి ఉత్పత్తులను విదేశాలకు పంపుతూ.. వాటిపై మేడ్ ఇన్ ఇండియా ముద్రను వెయ్యడం ద్వారా.. ఇండియా స్థాయిని అంతర్జాతీయంగా పైకి తేవాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. కేంద్రం 2014లో తెచ్చిన మేక్ ఇన్ ఇండియాకి అదనపు స్కీమే ఈ మేడ్ ఇన్ ఇండియా. ఇప్పటికే ఈ లేబుల్ ఎలా ఉండాలి, ఎంత సైజ్ ఉండాలి, ఏయే ఉత్పత్తులపై వెయ్యాలి వంటి అంశాలపై లోతైన చర్చ జరిగినట్లు తెలుస్తోంది. దీన్ని ఇప్పటికే స్టీల్ రంగంలో విజయవంతంగా అమలుచేశారు. ఈ సంవత్సరం జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యలో ఈ స్కీమ్‌ని అమల్లోకి తేవాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పథకాన్ని పైలట్ పథకంగా గతేడాది నవంబర్‌లో కేంద్రం అమలుచేసింది. ఇందుకోసం జిందాల్ స్టెయిన్ లెస్ స్టీల్, ప్రభుత్వ రంగ స్టీల్ అథార్టీ ఆఫ్ ఇండియాని ఎంచుకుంది. ఈ రెండు కంపెనీలు ఆల్రెడీ దీన్ని అమలు చేస్తున్నాయి. ఈ ఉత్పత్తులను విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి ఇండియాను అభివృద్ధి చెందిన దేశంగా చూడాలనుకుంటోంది. అలాగే.. అంతర్జాతీయ స్థాయిలో ఇండియా స్టాండ్‌ని పెంచాలనుకుంటోంది. అలా జరగాలంటే.. మేడిన్ ఇండియా అనే బ్రాండ్‌కి గుర్తింపు పెరగాలి. తద్వారా భారత ఉత్పత్తులకు అంతర్జాతీయంగా సేల్స్ పెరిగే ఛాన్స్ ఉంటుంది. అదే సమయంలో వాటి క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా చూసుకోవాలి. ఇవన్నీ గమనిస్తూ కేంద్రం మేడ్ ఇన్ ఇండియా స్కీమ్ తేబోతున్నట్లు తెలుస్తోంది.


## నెల్లూరు నగరంలో కష్టంగా మారిన ఉచిత విద్య..!

నెల్లూరు నగరంలో వీఆర్సీ, సర్వోదయ, ఎస్.వి.జి.ఎస్ డిగ్రీ ఎయిడెడ్‌తో పాటు డీకేడబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. వీటికి ఉన్న స్థలాలు, భవనాల విలువ పెరగడంతో.. ప్రభుత్వానికి ఇచ్చేందుకు ఎయిడెడ్ యాజ మాన్యాలు అంగీకరించడం లేదు. దాంతో మూడు ఎయిడెడ్ కళాశాలల్లో మూడేళ్లుగా కొత్తగా ప్రవేశాలు తీసుకోవడం లేదు. దాంతో ప్రస్తుతం డీకేడబ్ల్యూ కళాశాల మాత్రమే ఉంది. అదీ మహిళలది కావడంతో.. డిగ్రీ చదివే యువకులకు స్థానికంగా ప్రభుత్వ కళాశాల అందుబాటులో లేకుండా పోయింది. ప్రైవేటు కళాశాలల్లో చదివే వారికి ప్రభుత్వం బోధనా రుసుములు చెల్లిస్తున్నా.. అవి సక్రమంగా అందడం లేదు. దీంతో కొన్ని యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఎయిడెడ్ సంస్థలను ప్రభుత్వ కళాశాలలుగానే భావిస్తూ.. అవి ఉన్నచోట ఏర్పాటు చేయలేదు. వైకాపా ప్రభుత్వ నిర్ణయాలతో.. మారిన పరిస్థితులతో.. పేద విద్యార్థులు ప్రైవేటుకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 9 ప్రభుత్వ, 3 ఎయిడెడ్, 67 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉండగా– వీటిలో 33 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. జగన్ ప్రభుత్వ నిర్ణయంతో.. ఎయిడెడ్ కళాశాలలు ప్రైవేటుగా మారాయి. వాటిలోని అధ్యాపకులను ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. కొత్తగా భర్తీ చేయలేదు. ఉదాహరణకు వీఆర్సీ డిగ్రీ కళాశాలలో పనిచేసే 41 మంది బోధన, బోధనేతర సిబ్బందిని వెనక్కు తీసుకుంది. వారికి శిక్షణ ఇచ్చి.. పలు ప్రభుత్వ కళాశాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించింది. దాంతో మొత్తానికి ఎంతో చరిత్ర కలిగిన.. వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దిన వీఆర్సీ మూత పడింది. పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రైవేటులో ఫీజులు చెల్లించలేక.. ప్రభుత్వ కళాశాలలు దగ్గర్లో లేక అవస్థలు పడుతున్నారు. ఒక వేళ చేరాలను కుంటే సుమారు 7 కి.మీ. దూరం లోని కోవూరుకు పోవాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంలో వీఆర్సీ అంటే తెలియనివారు ఉండరు. ఇక్కడ చదువుకున్న వారు ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ప్రస్తుతం ఆ కళాశాల కళ




తప్పింది. డిగ్రీలో విద్యార్థులను చేర్చుకోవడం లేదు. ఎయిడెడ్‌ను రద్దు చేయడంతో పాటు ఉపాధ్యాయులను బదిలీ చేశారు. నగరంలో ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో.. పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నెల్లూరులో డిగ్రీ చదువుకునేందుకు చాలా మంది వస్తుంటారు. అలాంటిది, ఇప్పుడు ఇక్కడ వీఆర్సీ, సర్వోదయ వంటి కళాశాలలు ప్రాముఖ్యం కోల్పోయాయి. చాలా మంది తల్లిదండ్రులు అప్పులు చేసి.. ప్రైవేటు కళా శాలలకు పంపిస్తున్నారు. విద్యా దీవెన కూడా సక్రమంగా అందకపోవ డంతో.. పరీక్షల సమయంలో ఫీజు కట్టాల్సి ఉందని కొన్ని యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయి.


# 2019 ఎన్నికలు.. మసకబారిన శాసనసభ సంప్రదాయాలు





2019 ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన రెడ్డి నేతృత్వంలోని వైసిపికి అనూహ్య విజయం లభించింది. 175 స్థానాలకుగాను 151 స్థానాల్లో విజయం సాధించింది. రాష్ట్ర రాజకీయ చరిత్రలో జగన్మోహనరెడ్డి పిన్నవయస్కుడైన (46 యేళ్లు) ముఖ్యమంత్రి అయ్యారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ఓటమి చెందింది. ఆ పార్టీ కేవలం 23 స్థానాలు మాత్రమే దక్కించుకుంది. జగన్మోహనరెడ్డి గెలుపుతో రాష్ట్ర చరిత్రలో తండ్రీ కొడుకులు ముఖ్యమంత్రులుగా ఎన్నికైన చరిత్రను సొంతం చేసుకున్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికలతో కలిసి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా వైసిపి విజయం సాధించింది. 25 స్థానాలకుగాను 22 స్థానాలు గెలుపొందింది. మిగతా 3 స్థానాలు తెలుగుదేశం పార్టీ వశం అయ్యాయి. కొంచెం వెనక్కి వెళ్తే.. 2009 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహనరెడ్డి తొలిసారిగా ఎంపిగా ఎన్నికయ్యారు. అదే సంవత్సరం సెప్టెంబరులో తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించారు. వారసుడుగా తనకు ముఖ్యమంత్రిత్వం ఇవ్వలేదనే ఉద్దేశంతో కాంగ్రెస్‌ను వదిలి వైసిపిని స్థాపించారు. ఈ సందర్భంగానే అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణపై ఆయనను 2012 మే 27న అరెస్టు చేసి 16 నెలల పాటు చంచల్‌గూడ జైలులో ఉంచారు. 2013 సెప్టెంబరు 23న షరతులతో కూడిన బెయిల్ లభించింది. 2014 ఎన్నికలలో టిడిపి విజయం సాధించగా వైసిపి ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చింది. దీంతో రాష్ట్రంలో సుదీర్ఘ పాదయాత్ర చేపట్టారు. 2014 ఎన్నికల తర్వాత నుంచి శాసనసభ జరిగే తీరులో పెను మార్పు వచ్చింది. పాలకులు.. ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని కక్ష సాధింపుగా వ్యవహరించడం ప్రారంభమైంది. ఈ సంప్రదాయం 2004 నుంచే మొదలైంది. అప్పట్నించే చట్టాలు (శాసనాలు) చేసే శాసనసభ అవహేళనలకు, దూషణలకు నిలయమైంది. స్పీకర్లు సైతం తాము పదవిలో ఉన్నంతకాలం ఎన్నికైన పార్టీని వదిలివేయాల్సి ఉంటుంది. పక్షపాత రహితంగా వ్యవహరించాల్సి ఉంటుంది. స్పీకర్ సైతం సభలోనూ, సభ వెలుపలా సొంత పార్టీ కార్యకర్త మాదిరిగా ప్రకటనలివ్వడం వంటివి చోటుచేసుకున్నాయి. 2014 నుంచి ఇది మరింత పేట్రేగిపోయింది. ప్రజాస్వామిక వాదులకు, ప్రజాతం త్రవాదులకు విచారం కలిగించేలా పరిస్థితులు మారిపోయాయి. 2014 తరువాత అధికారం పక్షం నుంచి అవమానాలు, అవహేళనలు భరించలేక ప్రతిపక్ష నాయకుడు జగన్మోహనరెడ్డి తాను అధికారం పీఠం అధిష్టించే వరకూ శాసనసభ సమావేశాలకు హాజరుకాబోనని ప్రతిజ్ఞ చేసి అక్కణ్ణుంచి నిష్క్రమించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి విజయం సాధించింది. 175 సీట్లకుగాను 151 సీట్లు గెలుపొందింది. 1,56,88,569 (49.95 శాతం) ఓట్లు సంపాదించింది. 175 సీట్లకు పోటీ చేసిన టిడిపికి 23 స్థానాలు మాత్రమే లభించాయి. ఆ పార్టీకి 1,23,04,668 (39.17 శాతం) ఓట్లు లభించాయి. సినీ నటుడు పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన 137 స్థానాల్లో పోటీ చేసి 1 స్థానంలో మాత్రమే గెలిచింది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), బిజెపి, బిఎస్‌పి పార్టీలకు శాసనసభలో ప్రాతినిధ్యం లభించలేదు. ఈ ఎన్నికల్లో జనసేన, వామపక్షాలు అవగాహనతో పోటీ చేశాయి. 2019లో కొత్త శాసనసభలో కూడా పూర్వపు కక్ష సాధింపు సంప్రదాయం జడలు విప్పి నాట్యం చేసింది. 2009లో బాధితుడు జగన్మోహనరెడ్డి అయితే ఇప్పుడు బాధితుడు ప్రతిపక్ష నాయకుడైన చంద్రబాబు. ఆయన కూడా అధికార పార్టీ సభ్యుల అవహేళనలను, దూషణలను, ఇంటిలోని వ్యక్తుల పరువు తీసేలా చేసిన వ్యాఖ్యలను భరించలేక శాసనసభ వదిలి వెళ్లి పోయారు. మళ్లీ విజయం సాధించి శాసనసభలో అడుగు పెడతానని ప్రతిజ్ఞ చేసి శాసనసభ నుంచి వెళ్లిపోయారు. వయసు మీద పడిన కారణంగా కుమారుడితో యువజనగళం పాదయాత్ర ప్రారంభింపచేశారు. కొన్నాళ్లు సాగాక రాష్ట్ర ప్రభుత్వపు సిఐడి చంద్రబాబుపై కేసులు పెట్టింది. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ నెట్ వంటి కేసుల్లో అవినీతి ఆధారాలున్నాయంటూ కేసులు పెట్టి రాజమండ్రి జైలుకు పంపారు. సుమారు 2 నెలలపాటు ఆయన జైలులో ఉన్నారు. చర్చకు రాని ప్రజా సమస్యలు పాలక, ప్రధాన పక్షాలు వ్యక్తి గత కక్షలకు, కార్పణ్యాలకు వేదికగా తప్ప ప్రజా సమస్యలపై చట్ట సభలో చర్చ జరగడం లేదు. ఒకవేళ ఎవరైనా ప్రజా సమస్య ప్రస్తావిస్తే మీ హయాంలో జరిగిందేమిటి అంటూ అడ్డు సవాళ్లు వేయడం, తద్వారా గందోరగోళం సృష్టించడం పరిపాటిగా మారిపోయింది. ఈలోగా వక్తకు ఇచ్చిన సమయం అయిపోయిందంటూ స్పీకర్.. మైక్‌ను వేరే వారికి ఇవ్వడం జరుగుతోంది. ఏదైనా బిల్లు ప్రవేశపెడితే చర్చ జరగడం లేదు. గొడవలు జరుగుతున్నాయి. ఈ గొడవలోనే బిల్లు పాస్ అయిందని (చట్టం అయిందని) స్పీకర్ ప్రకటించేస్తున్నారు. దీంతో శాసనసభ ప్రజా సమస్యల వేదికగా గాక కక్ష సాధింపు సభగా మారిపోయిందని ప్రజల నుంచి వినవస్తోంది. రాయ వీలులేని దూషణలు చేసినా స్పీకర్లు మందలించపోవడం వంటి ఉదాహరణలు పదుల సంఖ్యలో 2014, 2019లో మనం విన్నాం. కన్నాం. ఈ కాలంలో ప్రజా సమస్యలపై పనిచేసి పోలీసుల లాఠీలతో దెబ్బలు తిని, జైళ్లకు వెళ్లే వామపక్షాలు ఎన్నికల్లో గెలవకపోవడం కూడా ప్రస్తుత దిగుజారుడు పరిస్థితికి కారణమన్నది సర్వత్రా వినవస్తోంది.

# ఈ ఎంపీ అభ్యర్థుల ఆస్తులు రూ.వేల కోట్లు .... అఫిడవిట్‌లో వెల్లడి




తెలుగు రాష్ట్రాల్లో కీలక పార్లమెంట్ స్థానాల నుంచి బరిలోకి దిగుతున్న ఇద్దరు ఎంపీ అభ్యర్థుల ఆస్తుల వివరాలు ఆసక్తికరంగా మారాయి. దేశంలో అత్యంత ధనవంతులైన ఎంపీ అభ్యర్థులు జాబితాలో ఆ ఇద్దరు నేతలు చేరిపోయారు. పార్లమెంట్ స్థానాలకు నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా సమర్పించిన అఫిడవిట్లో తమ తమ ఆస్తుల వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధిక ఆస్తులు కలిగిన ఎంపీ అభ్యర్థిగా గుంటూరు నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ టాప్ ప్లేస్ లో ఉన్నారు. అలాగే, రంగారెడ్డి జిల్లా బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సైతం ఆ తర్వాత స్థానంలో నిలిచారు. గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎన్ఆర్ఐ పెమ్మసాని చంద్రశేఖర్ పోటీ చేస్తున్నారు. ఈయన సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్లో పేర్కొన్న ఆయన ఆస్తులు చూస్తే షాక్ అవ్వాల్సిందే. మొత్తంగా రూ.5,785 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నట్టు ఆయన ప్రకటించారు. 37 పేజీల అఫిడవిట్లో పెమ్మసాని తన ఆస్తుల వివరాలు వెల్లడించారు. అమెరికాలో వివిధ రూపాల్లో రూ. 28.93 కోట్ల పెట్టుబడులు ఉన్నట్టు అఫిడవిట్లో పెమ్మసాని పే ర్కొనగా.. జేపీ మోర్గాన్ వంటి బ్యాంకుల్లో డిపాజిట్లు ఉన్నాయి. పెమ్మసాని పేరు మీద రూ.519 కోట్లు, ఆయన సతీమణి కోనేరు శ్రీరత్న పేరుతో మరో రూ.519 కోట్లు అప్పులు ఉన్నాయి. పెమ్మసాని కుటుంబానికి చరాస్తులు అధికంగా ఉన్నాయి. పెమ్మసాని పేరు మీద రూ.2,316 కోట్ల విలువైన చరాస్తులు ఉండగా, ఆయన భార్య శ్రీరత్న పేరుతో రూ.2,289 కోట్లు, పిల్లల్లో ఒకరి పేరుతో రూ.496 కోట్లు, మరొకరి పేరుతో రూ.496 కోట్లు ఉన్నాయి. స్థిరాస్తులు పెమ్మసాని చంద్రశేఖర్ పేరుతో రూ.69.33 కోట్లు, భార్య పేరుతో రూ.25 కోట్లు ఉన్నాయి. పెమ్మసానికి 181 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆయన సతీమణికి 2.5 కిలోల బంగారు ఆభరణాలు ఉన్నాయి. కుటుంబం పేరుతో రూ.4.20 లక్షల విలువైన 5.5 కేజీల వెండి ఆభరణాలు ఉన్నాయి. సొంతంగా మెర్సిడెస్ బెంజ్ ఎస్ క్లాస్, సీ క్లాస్, టెస్లా మోడల్ ఎక్స్ క్లాస్, రోల్స్ రాయిస్ ఘోస్ట్, టొయోటా ఫార్చునర్ కార్లు ఉన్నాయి. వీటి విలువ రూ.6.11 కోట్లుగా ఉంది. ఇదే స్థానానికి ఎమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు రవిశంకర్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన సమర్పించిన ఆస్తులు విలువ కూడా రూ.1,555 కోట్లు కావడం గమనార్హం. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి ఆస్తులు కూడా భారీగానే ఉన్నాయి. ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో తన కుటుంబం పేరిట రూ.4,490 కోట్ల ఆస్తులున్నట్లు ఆయన ప్రకటించారు. కొండా దంపతులు, వారి పిల్లల పేరు మీద ఒక్క వాహనం కూడా లేదు. విశ్వేశ్వరరెడ్డి పేరు మీద రూ.1,178.72 కోట్లు ఆస్తులు ఉండగా, ఆయన భార్య సంగీత రెడ్డి పేరుతో రూ.3,203.90 కోట్లు ఉన్నాయి. ఆయన కుమారు వీరజ్ మాధవరెడ్డి పేరున రూ.107.44 కోట్లు ఆస్తులు ఉన్నాయి. కొండా వద్ద రూ.3 లక్షలు, ఆయన భార్య వద్ద రూ.6 లక్షల నగదు మాత్రమే ఉంది. ఆయన పేరు మీద వివిధ బ్యాంకుల్లో రూ.17.69 కోట్ల అప్పులున్నట్లు పేర్కొన్నారు. విశ్వేశ్వరరెడ్డి వద్ద రూ.60 లక్షలు, ఆయన భార్య వద్ద రూ.10.44 లక్షల విలువైన ఆభరణాలు, వజ్రాలు ఉన్నాయి. కొండా పేరుతో చేవెళ్లలో మూడు ఎకరాలు, ధర్మసాగర్లో 43.26 ఎకరాలు, చేవెళ్ల మండలం కమ్మెటలో రెండు ఎకరాలు, కుమ్మెర్లో 21.13 ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది.

# నెల్లూరు జిల్లాలో టీడీపీ గట్టిగా విక్టరీ కొడుతుందా..?

ఏపీలో ఎన్నికల శంఖారావం మోగనున్న క్రమంలో నెల్లూరు జిల్లాలో ఇన్నాళ్లు ఒక లెక్క ఇప్పుడు ఒక లెక్క అన్నట్టు మారింది రాజకీయం. కడప తర్వాత వైసీపీకి కంచుకోటగా ఉంది నెల్లూరు జిల్లా. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 10 స్థానాలను కైవసం చేసుకుంది. అయితే ఓడలు బళ్లు అవుతాయి. బళ్లు ఓడలు అవుతాయి అనే మాట ఇప్పుడు అధికార వైసీపీకి కరెక్ట్‌గా సెట్ అయ్యేలా కనిపిస్తుంది. నాడు సీట్లు అన్నింటినీ క్లీన్ స్వీప్ చేసిన ఫ్యాన్ పార్టీ ఈసారి మాత్రం పవర్ లేక మూలనపడిందా అనే డౌట్ వస్తుంది. వైసీపీ సర్కారుపై ఉన్న వ్యతిరేకతతో నెల్లూరు జిల్లాలో టీడీపీకి ఫుల్ బూస్టింగ్ వస్తుంది. ఈ క్రమంలోనే వైసీపీ కంచు కోటలోనే టీడీపీ జెండా రెపరెపలాడనుందా అనే ఆసక్తి సర్వత్రా నెలకొంటుంది. ఏది జరిగినా మన మంచికే.. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని సహజంగా అంటుంటారు. ఈ నానుడు రాజకీయాల్లోనూ వినిపిస్తూ ఉంటుంది. గత ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత కూడా ఎక్కడా కుంగిపోకుండా పార్టీ శ్రేణులను నడిపిస్తున్నారు టీడీపీ అధినేత చంద్రబాబు. వైసీపీ కంచుకోటగా చెప్పుకునే నెల్లూరు జిల్లాలో ఈసారి మాత్రం వైసీపీపై ఉన్న వ్యతిరేకత టీడీపీకి అనుకూలంగా మారిందా అంటే. అవుననే సమాధానం వినిపిస్తుంది. ఇక దొరికిందే ఛాన్స్ అని ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. చంద్రబాబు వరుస పర్యటనలతో అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే పని ఉంటూ పార్టీ క్యాడర్లో నూతన జోష్ నింపుతున్నారు. నెల్లూరు జిల్లాలో తొలి నుంచి కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగినప్పటికీ వైసీపీ ఏర్పడ్డప్పటి నుంచి ఆ పార్టీ ఇక్కడ కీలకంగా మారింది. కానీ ఈసారి మాత్రం టీడీపీ బలం గట్టిగా ఉండడంతో వైసీపీ కంచు కోటని బద్దలు కొట్టేందుకు చూస్తోంది. జిల్లాలోని బడా నేతలు అందరిని ఆకర్ష్ పథకం కింద టీడీపీ గూటికి చేరేలా చేయడంలో టీడీపీ సక్సెస్ అయ్యింది. కీలక నేత ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సైతం ఇప్పుడు టీడీపీ నుంచి బరిలో ఉన్నారు. దాంతో ఈసారి ఏదేమైనా తాడోపేడో తెలుసుకునేందుకు సై అంటే సై అంటున్నారు టీడీపీ నేతలు. టీడీపీకి సపోర్ట్ గా బీజేపీ, జనసేన కూడా ఆయుధాలను సంధిస్తూ తోడవడంతో చంద్రబాబు వైసీపీ ప్లాన్స్‌కి పై ఎత్తులు వేస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజాగళం పేరిట వరుసగా పర్యటనలు చేస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు చంద్రబాబు. నెల్లూరు జిల్లాలో ఇప్పటికే వైసీపీ ముఖ్య నేతలంతా సైకిల్ ఎక్కేయడంతో.. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఛాన్స్ మిస్ చేసుకోను అంటూ బాబు ప్లాన్స్ వేస్తున్నారు. అందుకు గాను నిన్న ఒక్కరోజే ఉమ్మడి జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో పర్యటించారు చంద్రబాబు. ముందుగా గూడూరులో ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా ఆయన మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. 14 ఏళ్ల పాటు అధికారంలో ఉండగా తాను ఏం చేశానో చెబుతూనే భవిష్యత్తులో ఏం చేయబోతున్నాను కూడా చంద్రబాబు మహిళలకు అర్థమయ్యేలా వివరించే ప్రయత్నం చేశారు. దీంతో నియోజకవర్గ మహిళల్లో సైతం కొత్త జోష్ నెలకొంది. అలానే ఈ మీటింగ్ కి గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట నుంచి కూడా పార్టీ ప్రముఖ నాయకులు ఇక్కడకి రావడం పార్టీకి ప్లస్ గా మారింది. అదే స్పీడ్ లో సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరులో కూడా చంద్రబాబు పర్యటన సాగింది. ముందుగా రోడ్ షోలో పాల్గొన్న చంద్రబాబు వైసీపీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డిపై కూడా ఘాటైన విమర్శలు చేశారు. కేజీఎఫ్ 1, కేజీఎఫ్ 2 సినిమా థియేటర్లలో చూస్తే కేజీఎఫ్ త్రీ మాత్రం సర్వేపల్లిలో చూడవచ్చని సెటైర్లు వేశారు. మైనింగ్ మాఫియాతో వైసీపీ నేత ఫుల్ గా దోచుకుంటున్నారని బాబు దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వరుస పర్యటనలతో గూడూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో కాస్త స్తబ్దుగా ఉన్న టీడీపీ క్యాడర్లో కదలికలు వచ్చాయని అభిప్రాయపడుతున్నారు. అలానే వైసీపీలో అభ్యర్థులను ఎదుర్కోవడం కోసం టీడీపీ గెలుపు గుర్రాలపై దృష్టి పెట్టి అభ్యర్థులను ప్రకటించారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారంతో పాటు అధికార పక్ష నాయకులను దీటుగా ఎదుర్కొంటూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తున్నారు. ఈ నూతన ఉత్తేజం ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు కురిపిస్తాయా అంటే కాదనలేని పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు స్తబ్దుగా ఉన్న టీడీపీ క్యాడర్. చంద్రబాబు పర్యటనలతో జోష్ తెచ్చుకుంది. ఇక వైసీపీ ప్రధాన లీడర్లు టీడీపీలోకి రావడంతో గెలుపు గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి వైసీపీ వ్యతిరేకతతో పాటు ఆ పార్టీ ముఖ్య నేతలంతా టీడీపీ లోకి రావడం వరుస పర్యటనలతో చంద్రబాబు పార్టీ శ్రేణుల్లో జోష్ నింపడమే కాకుండా..అధికార పార్టీ నేతలపై వాగ్బాణాలు సంధిస్తూ దూసుకుపోవడం చూస్తుంటే నెల్లూరు జిల్లాలో టీడీపీ ఈసారి గట్టిగా విక్టరీ కొడుతుందా ? అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

# నారాయణ ఈసారి సిలబస్ మార్చాడట..!

పొంగూరు నారాయణ... ఆయన రెండు తెలుగు రాష్ట్ర ప్రజలకు సుపరిచితులైన నేత. నారాయణ విద్యాసంస్థల అధినేతగా ఆయన అందరికీ తెలిసిన వాడే. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన నారాయణ ఈసారి మాత్రం గెలవాలన్న కసితో తిరుగుతున్నారు. గత ఎన్నికల్లో నేర్చుకున్న పాఠాలు ఇప్పుడు ఆయన తనకు కలసి వస్తుందని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో జరిగిన తప్పులు ఇప్పుడు జరగకుండా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. 2014 ఎన్నికల్లో పోటీ చేయకపోయినా టీడీపీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్సీ అయి ఆయన మున్సిపల్ శాఖ మంత్రి అయ్యారు. రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. మున్సిపల్ శాఖ మంత్రిగా నారాయణ ఆ ఐదేళ్ల పాటు పనిచేసి ప్రధానంగా నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు పెద్దయెత్తున చేపట్టారు. 2019 ఎన్నికల్లో నారాయణ నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. అయితే ఆయన తన సమీప ప్రత్యర్థి అనిల్ కుమార్ యాదవ్ తో దాదాపు మూడు వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. దీంతో పాటు ఆయన అమరావతి రాజధాని నిర్మాణంలో జరిగిన అక్రమాలకు పాల్పడ్డారన్న దానిపై కేసులు నమోదు కావడంతో దాదాపు నాలుగున్నరేళ్ల పాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. పూర్తిగా తన విద్యాసంస్థలకే సమయాన్ని వెచ్చించారు. ఎక్కువ సమయం హైదరాబాద్ లోనే గడిపారు. విజయవాడ వైపు చూడను కూడా లేదు. నెల్లూరు నగరానికి కూడా పెద్దగా వచ్చింది లేదు. అక్రమ కేసులతో ఆయన ఏపీకి రావడమే మానేశారు. అయితే ఈసారి ఆయన ఎలాగైనా నెల్లూరు నగరం నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలవాలని భావిస్తున్నారు. అందుకు నగరమంతా చుట్టి వస్తున్నారు. నారాయణతో పాటు ఆయన భార్య కుటుంబ సభ్యులు కూడా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అయితే గత ఎన్నికల్లో తాను ఇచ్చిన డబ్బు ఓటర్లకు చేరలేదని, అందుకే తన ఓటమికి కారణమని నారాయణ నమ్ముతున్నారట. సొంత పార్టీ నేతలే డబ్బులు పంచకుండా, సరిగా జనం వద్దకు వెళ్లకపోవడంతోనే తన ఓటమికి ప్రధాన కారణంగా నారాయణ గుర్తించారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆర్థికంగా, సామాజికపరంగా బలవంతుడైన నారాయణ గత ఎన్నికల్లో డబ్బులు ఖర్చు బాగా ఖర్చు పెట్టినా గెలవలేకపోయారంటే.. అది సొంత పార్టీ నేతలే తనను మోసం చేశారన్న భావనలో ఆయన బలంగా ఉన్నారు. అందుకే ఈసారి ఆయన తప్పిదం చేయడం లేదని తెలిసింది. ప్రచారం నుంచి అంతటా ఆయన తన సిలబస్‌ను మార్చేశాడంటున్నారు. స్టడీ మెటీరియల్‌ను అదనంగా సిలబస్‌లో చేర్చాడన్న సెటైర్లు వినపడుతున్నాయి. స్థానిక టీడీపీ నేతలను తనతో పాటు ప్రచారంలో తిప్పుకుంటున్నప్పటికీ పూర్తి స్థాయి బాధ్యతలను వారికి ఈసారి ఇవ్వడం లేదని తెలిసింది. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ హామీలను వివరించే బాధ్యతను కూడా నారాయణ తన సొంత సైన్యాన్ని వినియోగిస్తున్నారట. నారాయణ స్కూళ్లు, కళాశాలల సిబ్బందిని నేరుగా రంగంలోకి దించి ఆయన తన పని కానిచ్చేస్తున్నారట. తన సొంత మనుషులుగా భావించే నారాయణ విద్యాసంస్థల సిబ్బందికి కీలక బాధ్యతలను అప్పగించినట్లు తెలిసింది. ఈ విషయంలో కొందరు స్థానిక టీడీపీ నేతలు గుర్రుగా ఉన్నప్పటికీ వారికి అవసరమైన సాయంచేస్తూ వారిని చల్లబరుస్తూ అసంతృప్తులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారట. మొత్తం మీద నారాయణ తన పొలిటికల్ స్కూల్ లో సిలబస్ మార్చి తన స్కూలు ఇదీ అంటూ కొత్త తరహాలో వెళుతున్నాడని పార్టీలో వినిపిస్తున్నట టాక్. ఈదఫా నారాయణ వైసీపీ అభ్యర్థి మహ్మద్ ఖలీల్ అహ్మద్ తో పోటీ పడుతున్నారు.

# ఏపీలో చిచ్చురాజేసిన ముస్లిం రిజర్వేషన్లు..


## వైసీపీ - కూటమి నేతల మధ్య పేలుతున్న మాటల తూటాలు



దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన రిజర్వేషన్లు విభజన తర్వాతా కొనసాగుతున్నాయి. అయితే, ఇటీవల కొందరు ఏపీ బీజేపీ నేతల కామెంట్లతో మైనార్టీ వర్గాల్లో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలోనే బీజేపీ నేతల వైఖరిని ప్రశ్నిస్తూ వైసీపీ ట్వీట్ చేసింది. కూటమి తరపున ఉమ్మడి ప్రచారం చేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురంధేశ్వరిని టార్గెట్ చేస్తూ సూటిగానే ప్రశ్నిస్తోంది. 4 శాతం రిజర్వేషన్ల అంశంపై వైఖరి చెప్పాకే ఓట్లు అడగాలి అంటూ డిమాండ్ చేస్తోంది. ఏపీలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల వేళ ముస్లిం రిజర్వేషన్ల అంశం తీవ్రస్థాయిలోనే చర్చనీయాంశం అవుతోంది. తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని భారతీయ జనతా పార్టీ స్పష్టంగా ప్రకటించినప్పుడు.. ఏపీకీ అదే వర్తిస్తుందనే వాదనను కొందరు నేతలు వినిపిస్తున్నారు. ఇటీవల దీనిపై పెద్ద దుమారమే చెలరేగడంతో పురంధేశ్వరి వివరణ ఇచ్చారు. రిజర్వేషన్ల రద్దుపై తాను ఎక్కడా మాట్లాడలేదని, కూటమిని టార్గెట్ చేసేందుకే ఈ ప్రచారం చేస్తున్నారని అన్నారు. అయితే, ఈ విషయంలో బీజేపీలోనే భిన్నాభిప్రాయాలు బయటపడ్డాయి. IYR కృష్ణారావు లాంటి వారు ఏపీ బీజేపీ నాయకత్వం తీరును బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇచ్చిన రిజర్వేషన్లు తొలగిస్తామని తెలంగాణ బీజేపీ నేతలు చెప్పినట్టే.. ఏపీలోనూ ఉండాలంటున్నారు. మొత్తానికి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల వేళ రిజర్వేషన్ల దుమారం కాకరేపుతోంది.

# మనోళ్ళు గెలుస్తారేమో... ఓడిస్తే పోలా..?

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు మరో నెలరోజులు ఉన్నాయి. సరిగ్గా వచ్చే నెల 13వ తేదీన పోలింగ్ జరగనుంది. అయితే విచిత్రమైన విషయం ఏంటంటే.. అన్ని పార్టీల్లో కీలక నేతలను ఓడించేందుకు కోవర్టుగా మారడమే ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అధికారంలోకి వస్తే రెండు, మూడు రకాలుగా మంత్రి వర్గంలో ఎవరైనా స్థానం కల్పిస్తారు. అదే ఇప్పుడు కొందరి పాలిట శాపంగా మారింది. తమ పార్టీ వారినే తాము ఓడించేందుకు రెడీ అయ్యారు. ఈ సంస్కృతి ఎప్పటి నుంచో ఉన్నా ఈ ఎన్నికల్లో మరీ శృతిమించి బహిరంగమయిందన్న విషయం తెలిసిన పార్టీ అగ్రనేతలు ఆశ్చర్యపోతున్నారట. ఇప్పటికే ఈ సమాచారం తెలిసి కొందరి నేతలకు వార్నింగ్ కూడా ఇచ్చారట. అధికారంలోకి రాగానే సామాజికవర్గం పరంగా, మహిళ కోటాలో, సీనియారిటీని చూసి ఇలా మూడు రకాలుగా మంత్రి పదవులను ఎవరైనా ఇస్తుంటారు. చంద్రబాబు అధికారంలోకి రానివ్వండి. జగన్ పవర్ లోకి రానివ్వండి.. అదే సూత్రం. కాకుంటే కొందరికి ఒకసారి ఛాన్స్ ఇచ్చి మరొకసారి మలి విడత మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పిస్తారు. అందుకే ఇప్పుడు




జిల్లాల్లో నేతలు సీనియర్ నేతలను, మహిళ అభ్యర్థులను ఓడించేందుకు సొంత పార్టీ నేతలే సిద్ధమవుతున్నారన్న సమచారం రావడంతో పార్టీ అగ్రనేతలు ఆశ్చర్యపోతున్నారట. ఫోన్ రికార్డింగ్‌లు కూడా వారికి లభ్యం కావడంతో పిలిచి మరీ అక్షింతలు వేస్తున్నారట. ప్రకాశం జిల్లాలో ఈసారి ఆయన గెలిస్తే హ్యాట్రిక్ విజయం అవుతుంది. తెలుగుదేశం అధికారంలోకి వస్తే ఆయనకు పదవి గ్యారంటీ. సామాజికవర్గం పరంగా కూడా ఆ నేతకు అన్నీ ప్లస్ గా ఉండటంతో అక్కడ ఆయనను ఓడించేందుకు జిల్లా అధ్యక్షుడే సిద్ధమయినట్లు వచ్చిన వార్తలు కలవరం కలిగిస్తున్నాయి. ఆయన గెలిస్తే మంత్రి పదవి దక్కుతుందని, అందుకే ఆయనను ఓడించండంటూ తన క్యాడర్ కు సదరు నేత ఫోన్లలో ఆదేశాలివ్వడం ఇందుకు అద్దం పడుతుంది. దీంతో ఇది తెలిసిన ఆ నేత పార్టీ చీఫ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయనను పిలిచి మరీ అధినేత క్లాస్ పీకినట్లు తెలిసింది. అలాగే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎలాగైనా అధికారంలోకి వస్తుందని గుంటూరు, చిత్తూరు, విజయనగరం జిల్లాల్లోనూ ఇదేరకమైన సీన్ క్రియేట్ కావడంతో టీడీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఇందుకు వైసీపీ కూడా ఏమీ మినహాయింపు కాదు. గతంలో గెలిచిన వాళ్లను ఓడించి మంత్రిపదవి దక్కకుండా చేయాలని కొందరు చూస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఏకంగా ఒక మంత్రి స్థాయిలో ఉన్న నేత అక్కడ ఆ నేతను ఓడించి తీరాల్సిందేనని పట్టుబడుతున్నారట. అందుకు అవసరమైన నిధులను తాను ప్రత్యర్థికి కూడా సమకూర్చడానికి రెడీ అయినట్లు వస్తున్న వార్తలు కలకలం రేపుతున్నాయి. నెల్లూరు జిల్లాలోనూ గతంలో మంత్రులుగా పనిచేసిన వారిని ఓడించడానికి వైసీపీ నేతలే నడుం బిగించడం విశేషం. ఇలా జనసేనలోనూ గుంటూరు జిల్లాలో కీలక నేతను ఓడించడానికి ఆ పార్టీ నేతలే ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. ఇంతకీ అధికారం ఎవరిది? అన్నది తెలియ కున్నా.. వస్తే మంత్రి పదవికి తమకు అడ్డం కాకూడదని వారిని ఎన్నికల్లోనే తప్పించే ప్రయత్నానికి కొందరు నేతలు దిగుతుండటం నిజంగా విచారకరమే మరి.

# నిధుల కొరతతో కునారిల్లుతున్న ఒఎస్‌సిలు

హింసకు గురైన మహిళలకు బాసటగా నిలిచేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన వన్ స్టాప్ కేంద్రాలు (ఒఎస్‌సి)లు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావించిన ఒఎస్‌సిలలో 82 శాతమే కార్యరూపం దాల్చాయి. పనిచేస్తున్న కేంద్రాలు కూడా నిధుల కొరతతో కునారిల్లుతున్నాయి. ఈ కేంద్రాలలో బాధితులకు తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడంతోపాటు వారికి అవసరమైన కౌన్సిలింగ్, ఉచిత వైద్యం, న్యాయపరమైన సహాయం అందించాల్సి ఉంటుంది. ఈ కేంద్రాలు మహిళల జీవితాలలో సానుకూల మార్పులు తీసుకొస్తాయని ప్రధాని నరేంద్ర మోడీ అప్పట్లో గొప్పగా చెప్పారు. ఈ కేంద్రాలకు కావాల్సిన నిధులు మాత్రం అందజేయడం లేదు. సిబ్బందికి శిక్షణ కూడా అరకొరగానే ఇచ్చారు. ఒఎస్‌సిల సాయం కోరిన బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించాల్సిన సిబ్బంది, వారిని మరింత అవమానించేలా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలలో ఒఎస్‌సిల ఏర్పాటులో తీవ్రమైన జాప్యం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో 26 కేంద్రాలు మంజూరు కాగా, 13 మాత్రమే ఏర్పడ్డాయి. నిధుల కొరతే దీనికి కారణం. కర్ణాటకలో 40 కేంద్రాలు ప్రారంభం కావాల్సి ఉండగా, 32 పనిచేస్తున్నాయి. నిధుల కొరత కారణంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. బాధితులను కాపాడేందుకు సిబ్బందికి అవసరమైన వాహనాలు కూడా సమకూర్చలేదు. బాధిత మహిళలు ఫోన్ చేస్తే వారి వద్దకు వెళ్లడానికి వాహనాలను అద్దెకు తీసుకోవాల్సి వస్తోందని, దీనివల్ల జాప్యం




జరుగుతోందని సిబ్బంది తెలిపారు. కొందరు సిబ్బంది అయితే ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకుంటున్నారు. వారికి ట్రావెల్ అలవెన్సును కూడా సరిగా ఇవ్వడం లేదు. 'లైంగిక నేరాల నుంచి బాలికలు, మహిళలకు రక్షణ కల్పించేందుకు బాధితులను ముందుగా ఆస్పత్రికి తీసుకుపోవాలి. ఆ తర్వాత శిశుమహిళా కమిటీ వద్దకు, న్యాయస్థానాలకు తీసుకెళ్లాలి. ప్రభుత్వమేమో మాకు డబ్బు ఇవ్వకుండా ఈ పనులన్నీ చేయాలని పురమాయిస్తోంది' అని సిబ్బంది వాపోయారు. రాత్రి సమయంలో బాధితులకు సహాయపడడానికి పోలీసు వాహనాలు, 108 అంబులెన్సులను సిబ్బంది వాడుకోవాల్సి వస్తోంది. పగటివేళ ఆటోలు, బస్సులను ఆశ్రయిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ప్రతి కేంద్రానికీ ఓ వాహనాన్ని సమకూర్చింది. ఒక్కో ఒఎస్‌సికి ఇస్తున్న నెలసరి కేటాయింపును 2022లో రూ.2.35 లక్షలకు పెంచారు. యుటిలైజేషన్ సర్టిఫికెట్ అందిన తర్వాత నిధుల పంపిణీ కోసం సింగిల్ నోడల్ అకౌంట్‌ను (ఎస్ఎన్ఏ) ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటి వరకూ నిధులు విడుదల జరగలేదు. ఎస్ఎన్ఏను ఏర్పాటు చేసిన 18 నెలల తర్వాత జీతాలు అందించారని, విద్యుత్ బిల్లులు సంవత్సరం నుండి పెండింగులో ఉన్నాయని, కనెక్షన్ తీసేయొద్దని విద్యుత్ శాఖను, ఇంటర్నెట్ సంస్థను కోరుతున్నామని కొందరు సిబ్బంది చెప్పారు. కొందరైతే తమ జేబులోంచి డబ్బులు తీసి బిల్లులు కడుతున్నారు. ఒఎస్‌సి పథకానికి అవసరమైన నిధులన్నింటినీ నిర్భయ నిధి నుండే సమకూరుస్తున్నారు. 2015 నుంచి ఇప్పటి వరకూ ఒఎస్‌సిలకు రూ.866.74 కోట్లు కేటాయించారు. నిర్భయ నిధి నుంచి విడుదల చేసింది రూ.798.81 కోట్లు మాత్రమే. అందులో కూడా రూ.339 కోట్లనే వినియోగించారు. అసలే నిధుల కొరతతో ఒఎస్‌సిలు విలవిలలాడుతుంటే తొమ్మిది దేశాలలో కూడా వీటిని ఏర్పాటు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. నేటి వరకూ విదేశాలలో ఒక్క కేంద్రమూ ప్రారంభం కాలేదు. బాధితులను కాపాడేందుకు ఒఎస్‌సిలో పనిచేసే సిబ్బంది పోలీసు వాహనాలను వాడుకుంటున్నప్పటికీ అవి ఎల్లవేళలా అందుబాటులో ఉండవు. వాహనాలు ఇచ్చేందుకు పోలీసులు నిరాకరిస్తే ప్రయివేటు వాహనాలే దిక్కవుతున్నాయి. బాధితులకు బాసటగా నిలవాల్సిన రాజకీయ నాయకులు కొన్ని సందర్భాలలో సిబ్బందిని బెదిరిస్తున్నారు. బాధితుల బంధువుల నుండి కూడా అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అవసరమైనప్పుడు పోలీసు సహాయం తీసుకోవచ్చు కానీ, రాత్రి సమయాలలో మాత్రమే అది సాధ్యపడుతోంది. మహిళలను వేధింపులకు గురిచేసే వారు పలుకుబడి కలవారైతే ఇక సిబ్బంది ఇబ్బందులు చెప్పనలవి కావు.

ఫీడ్ బ్యాక్ టు ఆంధ్రలక్ష్మి
'ఆంధ్రలక్ష్మి' వారపత్రికకు సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలు మీ దృష్టికి వస్తే మాకు తెలియజేయండి.... మేము నిర్భయంగా ప్రచురిస్తాం... మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం.
Cell : 9640300529
వార్తలకై www.andhralaxmitelugu.in చూడండి
email : Andhralaxminews@gmail.com
www. andhralakshmi@gmail.com, facebook.com/andharalaxmi

# పలు రంగాల వారికి ఉపాధి కల్పిస్తున్న సార్వత్రిక ఎన్నికలు ..!

సార్వత్రిక ఎన్నికల నగరా పలు రంగాల వారికి ఉపాధి కల్పిస్తోంది. ఈ వ్యాపారం ఐదేళ్లకోసారి మాత్రమే లభిస్తుంది. ఎన్నికల ప్రచారంలో ప్రధాన పాత్ర పోషించే వివిధ వత్తుల వారికి డిమాండ్ పెరిగింది. ఎన్నికల రాకతో వారి పంట పండుతోంది. కాసుల వర్షం కురుస్తోంది. ఇందుకు కావలసిన సంరంజామాను ముందస్తుగానే సమకూర్చుకునే పనిలో పడ్డారు. సీట్లు ఖరారు కాక ముందు నుంచే అభ్యర్థులు ప్రచారానికి, ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి కోసం ఉరుకులు పరుగులు పెట్టారు. నెల్లూరు జిల్లాలో కొన్ని నియోజక వర్గాల్లో అధికార పార్టీ ముందుగానే అభ్యర్థులను ప్రకటించడంతో అందుకు తగ్గ ఏర్పాట్లకు సన్నద్ధమయ్యారు. బ్యానర్ల ప్రింటింగ్ మొదలు.. వాటిని కట్టేవారి నుంచి ప్రచార రథాలు నడిపే డ్రైవర్లు, వంట మాస్టర్లు, క్యాటరింగ్‌లు, హొటళ్లు, సప్లయి చేసేవారు ఇలా ప్రతీ ఒక్కరికి చేతి నిండా పనే. వీరి వ్యాపారం మూడు ఆర్డర్లు, ఆరు అడ్వాన్సులుగా సాగుతోంది. దాదాపు రెండు నెలల పాటు తమ వ్యాపారానికి ఢోకా లేదన్న ధీమాతో ఉత్సాహంగా ఉన్నారు. నెల్లూరు రూరల్‌తోపాటు అన్ని నియోజకవర్గాల్లో ప్రచార రథాలు తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాలను చుట్టి రావడానికి అభ్యర్థులు ప్రచార రథాలను నమ్ముకోవడంతో వాటిని తయారు చేసే వారికి యమ డిమాండ్ పెరిగింది. ఆయా పార్టీల అభ్యర్థులు వాటిని తయారు చేసేవారి వద్దకు పరు గులు పెడుతున్నారు. ఆకర్షణీయమైన ప్రచార రథాలు చేయించుకునేందుకు అభ్యర్థులు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఖర్చుకు వెనకాడడం లేదు. టెక్నాలజీ పెరగడంతో ఈ రథాల రూపు రేఖలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. డిజిటల్ ఫ్లెక్సీలను రథాలకు అమర్చుతున్నారు. ఇందుకోసం తయారీదారులు ఇదే అవకాశంగా భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అభ్యర్థుల ప్రచార వాహనాలకు మూడు వైపుల ఫ్లెక్సీలు, లోపల డీజే ఏర్పాటు చేస్తున్నారు. డీజేలకు డిమాండ్ పెరిగింది. ఒక్కో వాహనానికి రూ.4000 నుంచి రూ.6000 వరకు ఖర్చు చేస్తున్నారు. అభ్యర్థి వెంట 5 నుంచి 10 వరకు వాహనాలు వినియోగిస్తున్నారు. అభ్యర్థుల ప్రచారం జానపద కళాకారుల బందం సందడితో సరికొత్త శోభను సంతరించుకుంటోంది. ఊరూరా తిరుగుతూ పాట, మాటలతో సందడి చేసి రోజుకు రూ.10వేల వరకు పొందుతున్నారు. గాయకులతో పాటలు పాడించి, సీడీలను రూపొందించడం ద్వారా రూ.వేలల్లో ఆర్జిస్తున్నారు. విందు.. పసందు ప్రచారానికి వచ్చే వారికి ఉదయం అల్పాహారం, సాయంత్రం, రాత్రి భోజనం వసతి కల్పిస్తున్నారు. వ్యక్తికి అల్పాహారం మధ్యాహ్నం, రాత్రి భోజనానికి ఏర్పాట్లు చేస్తుండడంతో వంట వాళ్లకు, క్యాటరింగ్‌కు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. అభ్యర్థులు ప్రచారంలో పాల్గొనే ఒక్కో వ్యక్తికి రోజుకు రూ.100నుంచి 180 పైగా ఖర్చు చేస్తున్నారు. నెల్లూరులో అధికార పార్టీ అభ్యర్థి ప్రముఖ క్యాటరింగ్ నిర్వాహకునికి ఈ బాధ్యతలు ఇవ్వగా, కూటమి అభ్యర్థి మాత్రం తన సామాజిక వర్గానికి చెందిన ఓ హొటల్‌కు కాంట్రాక్ట్ ఇచ్చారు. అయితే నెల్లూరు నగరంలో మాస్టర్లచే వంటలు చేయిస్తుండటం గమనార్హం. ఫోటో, వీడియో గ్రాఫర్లకూ ఉపాధి అభ్యర్థుల ప్రచార చిత్రాలు, వీడియోలు తీసేందుకు ఫోటో, వీడియోగ్రాఫర్లకు మంచి డిమాండ్ ఉంటుంది. ఎన్నికల ప్రచారం పూర్తయ్యే వరకు ఒక్కో ఫొటోగ్రాఫర్ రూ.30వేల నుంచి రూ.50వేలు, వీడియోగ్రాఫర్‌కు రూ.50వేల నుంచి 75వేల వరకు చార్జీలు తీసుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు ఖాళీగా ఉన్న నెల్లూరు రూరల్, నగరం, కోవూరు, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, సర్వేపల్లి ప్రాంతాల్లోని పలువురు ఫోటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్లు బిజీబిజీగా ఉండడం గమ నార్హం. టెంటు యజమానులకు గిరాకీ టెంట్‌హౌస్ యజమానులు కుర్చీకి రూ.10, టెంట్ సైజ్‌ను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. స్టేజ్ నిర్మాణం రూ.2వేల నుంచి రూ.5వేలు డిమాండ్ చేస్తున్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీల దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఒక్కో అభ్యర్థికి వేలాదిగా కరపత్రాలు, ఫ్లెక్సీల అవసరం. ఒక్కో కరపత్రానికి రూ.3 నుంచి 5, ఫ్లెక్సీకి సైజును బట్టి రూ.200 నుంచి రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నారు. ఈ లెక్కన అభ్యర్థికి రూ.లక్షల్లో ఖర్చు కానున్నది. ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చే అభ్యర్థులకు, ప్రధాన నాయకులను స్వాగతం చెప్పే క్రమంలో స్థానిక నాయకులు పూలు, పూలదండలతో సన్మానిస్తున్నారు. పూల వ్యాపారులకు ఉపాధి లభిస్తోంది. నియోజకవర్గాల్లో కూలీలతో ప్రచారం చేపడుతున్నారు. పట్టణాల్లో రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు చెల్లిస్తుండటం గమనార్హం.

# కోడ్ వచ్చినా.. ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు...

## ☛ కన్నెత్తి చూడని మైనింగ్, పోలీసు అధికారులు





ఇసుక అక్రమ తవ్వకాలు... అయిదేళ్ల వైకాపా పాలనలో నిత్యం వినిపించిన మాట. అధికార పార్టీ నాయకుల అండదండలతో పెన్నమ్మను కుళ్లబొడవడంతో పాటు నిబంధనలకు నీళ్లొదిలి అడ్డగోలుగా తవ్వి తరలించారు. అనుమతులు నిలిచిపోయి ఏడాది దాటినా దందా కొనసాగించిన అక్రమార్కులు.. చివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినా దోపిడీకి తెరదించలేదు. జాతీయ హరిత ట్రైబ్యునల్ తీర్పును, రాష్ట్ర స్థాయి పర్యావరణ మదింపు సంస్థ ఆదేశాలను ధిక్కరించి.. నదీ గర్భంలోనూ తోడేశారు. సోమశిల దిగువ ప్రాంతం నుంచి విడవలూరు మండలంలో నది సముద్రంలో కలిసే వరకు పలుచోట్ల ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేశారు. మొదట్లో అడ్డుకునేందుకు యత్నించిన కొందరు అధికారులపై ఒత్తిడి తీసుకురావడం.. బదిలీల పేరుతో వేధించడంతో.. ఆ తర్వాత వారు మాకెందుకులే అని పట్టించుకోవడమే మానేయగా.. అదే అదనుగా రూ.కోట్ల విలువైన ప్రకృతి సంపద దోచుకోవడంతో పాటు.. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించారని పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దొరికే ఇసుకకు ఇతర ప్రాంతాల్లో భారీ గిరాకీ ఉండగా– వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై కన్నేసింది. గత ప్రభుత్వంలో ఉచితంగా ఇచ్చిన వనరును.. జగన్ ప్రభుత్వం వ్యాపారంగా మార్చింది. అప్పటి వరకు అమల్లో ఉన్న విధానాన్ని రద్దు చేసింది. దీంతో ఇసుక బంగారంగా మారింది. అందుకు తగ్గట్టుగానే జిల్లాలోని పెన్నా పరీవాహకంలో 8 ఓపెన్ రీచ్‌లను గుర్తించింది. 2019 సెప్టెంబరులో కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఏపీఎండీసీ ద్వారా విక్రయాలు జరిపింది. ఆ తర్వాత మరో కొత్త విధానం తెచ్చేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. వెంటనే ఓ గుత్తేదారు సంస్థకు బాధ్యతలు అప్పగించింది. ఆ సంస్థ నుంచి అధికార పార్టీ వ్యక్తులు.. జిల్లాలో ఇసుకను రూ. 21 కోట్లకు లీజుకు తీసుకున్నారు. దాన్ని చెల్లించడంతో పాటు అధికంగా లాభం పొందాలనే ఉద్దేశంతో అక్రమాలకు తెరదీశారు. 2022 డిసెంబరు నాటికి దాదాపు జిల్లాలోని అన్ని రీచ్‌ల గడువు ముగిసినా.. తవ్వకాలు మాత్రం ఆగలేదు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాతా పలు రీచ్‌ల్లో కొనసాగడం గమనార్హం. ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా.. మీటరు నుంచి మీటరున్నర లోతు మాత్రమే తవ్వాల్సి ఉంది. 10 నుంచి 15 అడుగుల వరకు తవ్వుతున్నారు. దీంతో భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని సమీప గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునేవారు లేరు. ఇసుక లారీల రాకపోకలతో పొర్లుకట్టలు ధ్వంసమవడంతో పాటు రోడ్లన్నీ గుంతలమయంగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన చేస్తున్నా.. కొందరు స్థానిక అధికారులు గుత్తేదారులకే కొమ్ముకాయడం పరిపాటిగా మారింది. నిత్యం వందల లారీల రాకపోకల కారణంగా ఏర్పడుతున్న శబ్దాలతో నిద్రపోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసినా.. అతివేగం కారణంగా పిల్లలకు ఏం జరుగుతోందనన్న ఆందోళన చెందుతున్నా.. జిల్లా అధికారులకు వినిపించడం లేదని ఆరోపిస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇసుక ఎక్కడికి? ఏ అవసరాలకు పోతుందో అన్నదీ నమోదు చేయడం లేదు. దీంతో పాటు సామర్థ్యానికి మించి నింపుతున్నామంటూ.. అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ అనుమతి తీసుకున్న గుత్తేదారు సంస్థ గడువు ముగిసినా అదే పేరుతో దాదాపు ఏడాదిన్నర పాటు జిల్లాలో ఇసుక తవ్వకాలు జరిపింది. ఆ విషయం జిల్లాలో పనిచేస్తున్న మైనింగ్ అధికారులకు తెలిసినా పట్టించుకోలేదు. ఎప్పటికప్పుడు అదిగో.. ఇదిగో అనుమతి వస్తుందంటూ.. తవ్వకాలను అడ్డుకోలేదు. ఫలితంగా రూ. కోట్ల విలువైన వనరు సరిహద్దులు దాటిపోయింది. జిల్లాలోని ఎనిమిది రీచ్‌ల్లో.. అయిదింటిలో నిత్యం తవ్వకాలు జరిగాయి. ఒక్కో చోట రోజుకు 200 లారీలు, 300 ట్రాక్టర్ల చొప్పున లెక్కవేసుకుంటే.. రోజుకు రూ. 28.5 లక్షల విలువైన సంపద దోచుకున్నారు. ఈ లెక్కన అయిదు రీచ్‌లకు కలిపి రూ. 1.42 కోట్లు కాగా.. 30 రోజులకు రూ. 42.75 కోట్లుగా తేలింది. ఈ విధంగా గడువు ముగిసిన నాటి నుంచి ఎన్నికల కోడ్ వచ్చే వరకు 15 నెలల్లో రూ. 641.25 కోట్లు వైకాపా నాయకుల జేబుల్లోకి వెళ్లినట్లేనని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

Edited, Printed, Published and Owned by Shaik Ghouse Basha, Printed at Mohammed Press, D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001, Andhra Pradesh, Publihsed at D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001. Andhra Pradesh,
Editor : Shaik Ghouse Basha Cell : 9640300529